ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -96 పేజీలు - 08 వెల - 04/- ఆదివారం19 జనవరి 2025

# 65 లక్షల మందికి ఆస్తి హక్కు కార్డులు

**వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంపిణీ**

**ఆస్తి హక్కులతో భరోసా వస్తుందన్న ప్రధాని మోడీ**



న్యూఢిల్లీ,**జనవరి 18** ఆంధ్ర ప్రగతి:
ప్రధాని నరేంద్ర మోడీ శనివారం సుమారు 65 లక్షల ఆస్తి హక్కు కార్డులు పంపిణీ చేశారు. అవి ఆర్థిక కార్యకలాపాలను పెంపొందిస్తాయని, దారిద్య నిర్మూలనకు దోహదం చేస్తాయని ప్రధాని మోడీ ప్రకటించారు. ప్రధాని మోడీ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా లబ్దిదారులు కొంత మందితో మాట్లాడారు. ఈ పథకం రుణాలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడానికి తోడ్పడుతుందని ఆయన చెప్పారు. పది రాష్ట్రాలు ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, మధ్య ప్రదేశ్,మిగతాది 2లో...

## ప్రతినెలా మూడో శనివారం

# స్వచ్ఛ ఆంధ్ర కోసం



'స్వచ్ఛ ఆంధ్ర' కోసం అందరూ కలిసి పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. కడప జిల్లా మైదుకూరులో 'స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్'ను సీఎం ప్రారంభించారు

**మంచికోసం మైండ్‌సెట్ మార్చుకోవాలన్న చంద్రబాబు**

**మైదుకూరులో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' ప్రారంభం**

**లోకేశ్‌ను డిప్యూటీ సిఎం చేయాలంటూ శ్రీనివాసరెడ్డి ప్రతిపాదన**

2లో



**ప్యాకేజీ ఇచ్చినంత మాత్రాన**

## విశాఖ ఉక్కును ఉద్ధరించినట్లు కాదు



**విశాఖ స్టీల్ ప్లాంట్ కు కేంద్రం ఉద్దీపన ప్యాకేజీ**

**ప్యాకేజీతో ఒరిగేదేమీ లేదన్న షర్మిల**

**సెయిల్ లో విలీనం, సొంత గనులు కేటాయిస్తేనే నిజమైన పరిష్కారమని వెల్లడి**

2లో

# పరిశుభ్రత జీవితంలో భాగం కావాలి

**పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత**

**స్వచ్ఛంధ్ర - స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో పవన్ కళ్యాణ్**



గుంటూరు,**జనవరి 18**ఆంధ్ర ప్రగతి:
స్వచ్ఛత అన్నది జీవితంలో భాగం కావాలని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. 'స్వచ్ఛంధ్ర – స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు. ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛంద కార్యక్రమం నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని పవన్ కల్యాణ్ తెలిపారు. నంబూరులో శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. పారిశుద్ధ్య వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. కంపోస్ట్ యంత్రాలను పవన్ కల్యాణ్ పరిశీలించారు.మిగతాది 2లో...





2లో

## ఏపీతో కలిసి పని చేయడానికి సిద్ధం

**కావాల్సిన సాంకేతిక సహకారం అందిస్తాం : ఎన్ఐఎస్‌జీ చీఫ్ ఎగ్జిగ్యూటివ్ ఆఫీసర్ బన్సల్**

**ఆర్టీజీఎస్‌లో ప్రభుత్వాధికారులతో ఎన్ఐఎస్‌జీ అధికారుల సమావేశం**

**తక్కువ ఖర్చుతోనే ప్రభుత్వానికి కన్సల్టెన్సీ సర్వీసులు అందిస్తామని వెల్లడి**



2లో

## కేజ్రీవాల్ కారుపై రాళ్ల దాడి...

**బీజేపీ-ఆమ్ ఆద్మీ పార్టీల మాటల యుద్ధం**

**ఎన్నికల ప్రచారం సమయంలో రాళ్ల దాడి**

**ఓటమి భయంతో బీజేపీ తమ ప్రచారాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తోందన్న ఆమ్ ఆద్మీ**

**కేజ్రీవాల్ కాన్వాయ్ ఇద్దరు వ్యక్తులను ఢీకొట్టిందన్న బీజేపీ**

## తెలంగాణలో ఎస్‌టీటీ డేటా సెంటర్ భారీ పెట్టుబడి

**రూ.3,500 కోట్ల పెట్టుబడికి శ్రీధర్‌బాబు సమక్షంలో ఒప్పందం**




హైదరాబాద్,**జనవరి 18** ఆంధ్ర ప్రగతి తెలంగాణలో భారీ పెట్టుబడి పెట్టేందుకు ఎస్‌టీటీ డేటా సెంటర్ ముందుకొచ్చింది. ఈ సంస్థ రూ.3,500 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. సింగపూర్‌లోని ఎస్‌టీటీ డేటా సెంటర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంవోయూపై ఎస్‌టీటీ సీఈవో బ్రూనో సంతకాలు చేశారు. ఇప్పటికే హైటెక్ సిటీలో ఓ డేటా సెంటర్ నిర్వహిస్తోన్న ఎస్‌టీటీ.. ముచ్చర్ల మీర్‌ఖాన్‌పేట్‌లో మరో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. ఎస్‌టీటీ డేటా సెంటర్ సంస్థ నిర్ణయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. డేటా సెంటర్ హబ్‌గా హైదరాబాద్ మారుతోందని హర్షం వ్యక్తం చేశారు.

## తెలంగాణలో టీడీపీని బలోపేతం చేస్తాం : నారా లోకేశ్

**సొంత నిధులతో ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణ**

**మరమ్మత్తులు చేపట్టాలని మంత్రి లోకేశ్ ఆదేశం**



2లో

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# పరిశుభ్రత జీవితంలో భాగం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... పరిశ్రుభ్రత కల్చర్ అవ్వాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన అని చెప్పారు. చెత్త ఎక్కడపడితే అక్కడ పడేయకూడదని అన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించవచ్చు అని పవన్ కల్యాణ్ తెలిపారు. పరిశుభ్రత ప్రాధాన్యత కరోనా సమయంలో అందరికీ తెలిసి వచ్చిందన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచటం అనేది ఏ ఒక్కరి వల్లో అయ్యేది కాదన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం అనేది ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. పరిశుభ్రత మన జీవితంలో భాగం కావాలని చంద్రబాబు ఆకాంక్షించారని అన్నారు. వెంటనే అద్భుతాలు ఆశించలేమని.. కానీ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుంటే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పవన్ కల్యాణ్ తెలిపారు.పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో మొక్కలు నాటారు. పరిశుభ్రత ప్రాధాన్యత కరోనా సమయంలో అందరికీ తెలిసి వచ్చింది. పరిసరాలను శుభ్రంగా ఉంచటం అనేది ఏ ఒక్కరి వల్లో అయ్యేది కాదు.. అందరూ బాధ్యత తీసుకోవాలి. పరిశుభ్రత మన జీవితంలో భాగం కావాలని చంద్రబాబు ఆకాంక్ష. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం అనేది తేలికైన విషయం కాదు. వెంటనే అద్భుతాలు ఆశించలేం కానీ.. ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకుంటే మెరుగైన ఫలితాలు సాధించవచ్చు‘ అని పవన్ అన్నారు.

# 65 లక్షల మందికి ఆస్తిహక్కు కార్డులు

(మొదటి పేజీ తరువాయి)

మహారాష్ట్ర, మిజోరామ్, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లలోని 50 వేల పైచిలుకు గ్రామాల్లో లబ్దిదారులకు ఈ ఆస్తి కార్డులు పంపిణీ చేశారు.’శనివారం 65 లక్షల కార్డుల పంపిణీ దృష్టా గ్రామాల్లోని సుమారు 2.24 కోట్ల మంది లబ్దిదారుల వద్ద ఇప్పుడు స్వమిత్వ ఆస్తి కార్డులు ఉంటాయి’ అని ప్రధాని తెలిపారు. ’ఆస్తి హక్కులు ప్రపంచ వ్యాప్తంగా పెద్ద సవాల్. కొన్ని ఏళ్ల క్రితం ఐక్యరాజ్య సమితి (యుఎన్) ఒక సర్వే నిర్వహించింది. పలు దేశాల్లో ఆస్తి హక్కులకు సంబంధించిన చట్టబద్ధ పత్రాలు జనం వద్ద లేవని ఆ సర్వే వెల్లడించింది. దారిద్ర్య నిర్మూలనకు ఆస్తి హక్కులు ముఖ్యం అని యుఎన్ స్పష్టం చేసింది’ అని మోదీ తెలియజేశారు. గ్రామాల్లో ఆస్తి ఒక ’వ్యర్థ మూలధనం’ అని, దానితో ప్రజలు ఏమీ చేయలేరని, వారి ఆదాయం పెంపునకు అది తోడ్పడదని ప్రముఖ ఆర్థికవేత్త ఒకరు అభిప్రాయం వ్యక్తం చేశారని ప్రధాని చెప్పారు. ’భారత్‌పై ఈ సవాల్ ప్రభావం పడింది. గ్రామాల్లో ప్రజల వద్ద లక్షలాది రూపాయలు విలువ చేసే ఆస్తి ఉంది, కానీ వారి వద్ద ఆ ఆస్తి పత్రాలు లేవు. వివాదాలు ఉన్నాయి, ఆస్తులు లాక్కున్నారు, తుదకు బ్యాంకులు సైతం దానిపై రుణాలు ఇవ్వడం లేదు’ అని ఆయన వివరించారు. ’పూర్వపు ప్రభుత్వాలు దాని గురించి ఏదైనా చేయడానికి చర్యలు తీసుకున్నాయి. కానీ అంతగా ఏదీ జరగలేదు’ అని ఆయన చెప్పారు. దళితులు, వెనుకబడిన తరగతులవారు, ఆదివాసీలు దీని వల్ల దారుణంగా నష్టపోయారని మోదీ తెలిపారు. ’చట్టబద్ధమైన ఆస్తి హక్కులు పొందిన తరువాత లక్షలాది మంది ప్రజలు రుణం తీసుకున్నారు. తమ వ్యాపారాలు ప్రారంభించేందుకు వారు ఈ డబ్బు ఉపయోగించు కున్నారు. వారిలో అనేక మంది రైతులు, వారికి ఈ ఆస్తి కార్డులు ఆర్థిక భద్రతకు గ్యారంటీ’ అని మోదీ చెప్పారు. స్వమిత్వ, భూ ఆధార్ గ్రామాల అభివృద్ధికి పునాది అవుతాయని కూడా ప్రధాని మోదీ తెలిపారు. కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ’లలన్’, సహాయ మంత్రి ఎస్‌పి సింగ్ భాఘెల్, కార్యదర్శి వివేక్ భరద్వాజ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు సిఎంలు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు వర్చువల్‌గా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# ప్యాకేజీ ఇచ్చినంత మాత్రాన విశాఖ ఉక్కును ఉద్ధరించినట్లు కాదు: షర్మిల

వైజాగ్ స్టీల్ ప్లాంట్ కు కేంద్రం ఉద్దీపన ప్యాకేజి ప్రకటించడంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందించారు. రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ ఇచ్చినంత మాత్రాన విశాఖ ఉక్కును ఉద్ధరించినట్లు కాదని, ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని గౌరవించినట్టు కాదని సూటిగా విమర్శించారు. ఆ ప్యాకేజితో ఒరిగేదేమీ లేదని, ప్లాంట్ ఆర్థిక కష్టాలు గట్టెక్కలేదని పేర్కొన్నారు. ఇది తాత్కాలిక ఉపశమనం తప్ప, శాశ్వత పరిష్కారం ఎంతమాత్రం కాదని షర్మిల స్పష్టం చేశారు.
“విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్ లో విలీనం చేయడమే శాశ్వత పరిష్కారం. విశాఖ ప్లాంట్ కు సొంత గనులు కేటాయించడమే అసలైన పరిష్కారం. ప్లాంట్ సామర్థ్యాన్ని 20 మిలియన్ టన్నులకు విస్తరించినప్పుడే ఉక్కు సంకల్పం నెరవేరినట్టు లెక్క. ఇవేమీ పట్టించుకోకుండా రెండేళ్లలో విశాఖ ఉక్కును నెంబర్ వన్ గా నిలబెడతామనడం ఆంధ్రుల చెవుల్లో కేంద్రం మరోసారి పూలు పెట్టినట్టుగానే భావించాలి” అంటూ షర్మిల ధ్వజమెత్తారు.

# తెలంగాణలో టీడీపీని బలోపేతం చేస్తాం : నారా లోకేశ్

## దివంగత నేత ఎన్టీఆర్‌కు కుటుంబ సభ్యుల నివాళి



హైదరాబాద్,ఆంధ్ర ప్రగతి:
ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్‌కు లోకేశ్ చేరుకున్నారు. దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఘాట్ వద్ద లోకేశ్ నివాళులు అర్పించారు. అయితే ఘాట్ నిర్వహణను చూసి ఆయన తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఘాట్ గోడలు, పైకప్పు పెచ్చులు ఊడిపోవడం, గా÷-డ్గ÷న్‌లో ఏర్పాటు చేసిన లైట్లు విరిగిపడి ఉండటాన్ని లోకేశ్ గమనించారు. ఘాట్ నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన హెచ్‌ఎండీఏ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ ఘాట్ మరమ్మతు పనులు తన సొంత నిధులతో వెంటనే చేపట్టాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణను హెచ్‌ఎండీఏ అధికారులు పట్టించుకోవడం లేదంటూ అక్కడికి వచ్చిన ఎన్టీఆర్ అభిమానులు సైతం తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఇదేనా ఓ మహానేతకు ఇవ్వాల్సిన గౌరవం అంటూ మండిపడ్డారు. ఘాట్ నిర్వహణ తమకు అప్పగించాలని గతంలో పలుమార్లు తెలంగాణ ప్రభుత్వానికి ఎన్టీఆర్ ట్రస్ట్ విజ్ఞప్తి చేసింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. తాజాగా ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణను చూసి ఎంతో బాధపడిన మంత్రి లోకేశ్.. అవసరమైన అనుమతులు తీసుకొని వీలైనంత తొందరగా మరమత్తు పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కాగా, శనివారం ఉదయం నుంచీ ఎన్టీఆర్ ఘాట్ వద్దకు నందమూరి, నారా కుటుంబసభ్యులు, బంధువులు, ఎన్టీఆర్ అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి దివంగత నేతకు నివాళి అర్పించారు. హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ, జూ.ఎన్టీఆర్, కల్యాణ్ రామ్, లక్ష్మీపార్వతి, ఏపీ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు సహా పలువురు ప్రముఖులు వచ్చి ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు.

# ఏపీతో కలిసి పని చేయడానికి సిద్ధం

## ఎన్ఐఎస్‌జీ చీఫ్ ఎగ్జిగ్యూటివ్ ఆఫీసర్ రాజీవ్ బన్సల్



జనవరి ఆంధ్ర ప్రగతి
ఆంధ్రప్రదేశ్‌తో కలిసి పని చేయడానికి తాము ఎంతో ఆసక్తితో ఉన్నామని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ స్మార్ట్ గవర్నెన్స్ (ఎన్ఐఎస్‌జీ) సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజీవ్ బన్సల్ అన్నారు. ప్రభుత్వ శాఖలకు కావాల్సిన సాంకేతిక సహకారం అందించడానికి తాము సుముఖంగా ఉన్నామన్నారు.శుక్రవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్)లో ఎన్ఐఎస్‌జీ సంస్థ ప్రతినిధుల బృందం రాష్ట్ర ప్రభుత్వాధికారులతో సమావేశమైంది. ఈ సందర్భంగా రాజీవ్ బన్సల్ మాట్లాడుతూ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ స్మార్ట్ గవర్నెన్స్ సంస్థ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ సహ వివిధ రాష్ట్రాల్లో చేపడుతున్న వివిధ కార్యకలాపాల గురించి వివరించారు. ఆయా రాష్ట్రాలకు వారి అవసరాలను బట్టి ఈ-గవర్నెన్స్, స్ట్రాటజీ ప్లానింగ్, డిజైనింగ్ తదితర రంగాల్లో సహకారం అందించడంతో పాటు ఆధునిక సాంకేతిక ప్రపంచంలో వస్తున్న సరికొత్త టెక్నాలజీలను ప్రభుత్వాలు సమర్థవంతంగా వినియోగించుకోవడానికి అవసరమైన సహకారం తాము అందిస్తామని చెప్పారు. తమది ఎలాంటి లాభాపేక్ష లేనటువంటి సంస్థని తెలిపారు. తక్కువ ఖర్చుతోనే ప్రభుత్వానికి తాము కన్సల్టెన్సీ సర్వీసులు అందిస్తామన్నారు. గత రెండు దశాబ్దాలలో తమ సంస్థ ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. 30 వేల మందికి పైగా వివిధ స్థాయిలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణ కల్పించామని, 200లకుపైగా ప్రాజెక్టులను వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నిర్వహించామని వివరించారు. ఆంధ్రప్రదేశ్ తమ సంస్థకు మొట్టమొదటి ప్రమోటర్‌గా పనిచేసిందనే విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతో మరింత దృఢమైన భాగస్వామ్యం ఏర్పరచుకుని ఏపీ ప్రభుత్వంలో విస్తృతంగా కార్యకలాపాలు నిర్వహించాలని, ఏపీ ప్రభుత్వానికి కావాల్సిన సాంకేతిక సహకారం అందించాలని తమ సంస్థ ఎదురు చేస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశయాలకు అనుగుణంగా రూపొందించిన స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనలో కూడా కావాల్సిన సాంకేతిక సహకారం అందించడానికి తాము ఆసక్తిగా ఎదురు చూస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్ఐఎస్‌జీతో కలిసి పనిచేయడానికి సుముఖంగా ఉందన్నారు. ప్రభుత్వ శాఖలు తమ కార్యకలాపాలు అమలు చేసే సందర్భంలో ఎదురయ్యే సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు అవసరమని, ఆ దిశగా ఈ సంస్థ సహకారం అందించాలని కోరారు. పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేశ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇప్పటికే డీప్ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర రంగాలపై చాలా చురుగ్గా పనిచేస్తోందని, ఈ దిశగా ఎన్ఐఎస్టీ సహకారం కూడా తీసుకుంటామన్నారు.
ఐటీ కార్యదర్శి ఎన్ యువరాజ్ మాట్లాడుతూ హైదరాబాద్ తరహాలో అమరావతిలో కూడా ఎన్ఐఎస్టీ ఒక కార్యాలయం ఏర్పాటు చేసుకుంటే సముచితంగా ఉంటుందని సూచించగా దానికి ఆ సంస్థ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. తొలుత ఎన్ఐఎస్టీ ప్రతినిధుల బృందానికి ఆర్టీజీఎస్ సీఈఓ కె. దినేశ్ కుమార్ స్వాగతం పలికారు.

# ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కోసం

కడప,జనవరి 18 ఆంధ్ర ప్రగతి
ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కోసం పని చేయాలని సిఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. తరతరాలుగా వస్తున్న అలవాట్లు త్వరగా పోవు. మంచి అలవాట్లు పాటించేందుకు చాలా సమయం పడుతుంది. చెడు ఆలోచనలు, చెడు పనులు చేయకుండా మన మైండ్‌ను నిత్యం మనమే కంట్రోల్ చేయాలి. ఇల్లు, పరిసరాలు బాగుంటేనే మంచి ఆలోచనలు వస్తాయి. ఆహ్లాదకర వాతావరణం ఉంటేనే ఏదైనా సాధించగలం. పని ప్రాంతాన్ని కూడా అందరూ శుభ్రంగా ఉంచుకోవాలని సీఎం సూచించారు. ’స్వచ్ఛ ఆంధ్ర’ కోసం అందరూ కలిసి పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. కడప జిల్లా మైదుకూరులో ’స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్’ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ‘మన దేశం పరిశుభ్రంగా ఉండాలని గాంధీజీ తపించారు. ప్రధాని మోదీ సారథ్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టాం. పారిశుద్ధ్య సాధన దిశగా దేశ ప్రజలంతా చేతులు కలపాలి. జపాన్‌లో రోడ్లు కూడా ఎంతో పరిశుభ్రంగా ఉంటాయి. అక్కడ కాగితం కూడా జేబులో పెట్టుకుని ఇంట్లోని చెత్తబుట్టలో వేస్తారు. మనం మాత్రం ఇంట్లో ఉండే చెత్తను రోడ్డుపై పోస్తున్నాం. గతంలో ఏ ఊరు వెళ్లినా చెత్తాచెదారం కనిపించేది. గ్రామాల్లో మహిళల పరిస్థితి చూసి ఎంతో బాధపడే వాడిని. ఆరోజుల్లో వంట చేయడం మహిళలకు నరకంగా ఉండేది. దీపం కార్యక్రమం కింద ఆనాడు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చాం. ఇప్పుడు దీపం-2 కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. ఆరోజు మేం ఇచ్చిన నివేదిక మేరకు స్వచ్ఛభారత్ కార్పొరేషన్ తెచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర కోసం సేవకులుగా పనిచేస్తామని చాలా మంది వచ్చారు. సమాజహితం కోసం కష్టపడేవారిని మనమంతా గుర్తించాలి.మైదుకూరులో సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టాం అని అన్నారు. ఇదిలావుంటే విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌పై టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రి లోకేశ్‌ని ఏపీ ఉప ముఖ్యమంత్రిగా ప్రమోట్ చేయాలని శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మైదుకూరు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఆయన కోరారు. రాష్ట్రాభివృద్ధి కోసం లోకేశ్ చేస్తున్న కృషిని గుర్తించాలని ముఖ్యమంత్రిని అభ్యర్థించారు. అన్ని రకాలుగా యువతను పోత్సహించే విధంగా ఐటీ, పారిశ్రామిక రంగాలకు చెందిన అనేక పరిశ్రమలను ఏపీకి తెచ్చేందుకు లోకేశ్ విశేష కృషి చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. భవిష్యత్తులో పార్టీకి, యువతకు భరోసా ఇవ్వాలంటే లోకేశ్‌ను డిప్యూటీ సీఎంగా ప్రమోట్ చేయాలంటూ సీఎం చంద్రబాబు ఎదుట శ్రీనివాసరెడ్డి ప్రతిపాదనలు పెట్టారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. నదుల అనుసంధానం ద్వారా కరవు రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే తన లక్ష్యమని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు ఏపీ జీవనాడని, రెండేళ్లల్లో దాన్ని పూర్తి చేసి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. రాయలసీమకు గోదావరి నీటిని తీసుకువస్తామని, సీమ రైతులు మీసం తిప్పేలా చేస్తానని సీఎం చెప్పారు. వేంకటేశ్వరస్వామి పాదాల వరకూ గోదావరి నీటిని తీసుకువస్తామని, బనకచర్లకు నీళ్లు తీసుకురావడం తన జీవిత ఆశయమని చంద్రబాబు చెప్పుకొచ్చారు. కడప స్టీల్‌ప÷-లాంట్, కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్ త్వరలోనే పూర్తి చేసి ఉపాధి అవకాశాలు పెంచుతామని హామీ ఇచ్చారు. జనవరి చివరికల్లా వాట్సాప్ గవరెన్స్ తీసుకొస్తామని, గండికోటను టూరిజం హబ్‌గా చేస్తామని తెలిపారు.

# పెంచి పోషించిన ఉగ్రవాదమే పాక్‌ను దహిస్తోంది

## సీమాందర ఉగ్రవాదం ఇప్పుడు శాపంగా మారింది పాకిస్థాన్‌పై మండిపడ్డ విదేశాంగ మంత్రి జైశంకర్



ముంబయిజనవరి 18 ఆంధ్ర ప్రగతి
తాను పెంచి పోషించిన ఉగ్రవాదమే ఇప్పుడు క్యాన్సర్‌లా దహించి వేస్తోందని పాకిస్థాన్‌పై భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ మరోసారి విరుచుకుపడ్డారు. ఉగ్రవాదాన్ని ’క్యాన్సర్’ వ్యాధితో పోల్చిన ఆయన.. పాక్ పెంచి పోషించిన ఉగ్రవాదం ఇప్పుడు ఆ దేశ ప్రజలనే కబళిస్తోందని విమర్శించారు. ముంబయిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న జైశంకర్.. దాయాదిపై విమర్శలు గుప్పించారు. ‘ మన పొరుగున ఉన్న పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోంది. అదే ఇప్పుడు వారి పాలిట శాపమైంది. అది క్రమంగా ఆ దేశ రాజకీయాల్లోకీ ప్రవేశిస్తోంది. సీమాంతర ఉగ్రవాదాన్ని అణచివేయాలని భారత్ సహా పలుదేశాలు కోరుతున్నాయి.‘ అని జైశంకర్ తెలిపారు. అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, ఈ విషయంలో ఎలాంటి వెనుకబాటుకు తావివ్వకూడదని సూచించారు. పాశ్చాత్య విధానానికి భారత్ వ్యతిరేకమైనప్పటికీ.. వ్యూహాత్మక ప్రయోజనాల కోసం మద్దతిస్తుందని పేర్కొన్నారు. ఆయుధీకరణ విషయంలో భారత్ స్వావలంబన పెంచుకోవాల్సిన అవసరముందన్నారు.భారత్‌ను ’విశ్వబంధు’గా అభివర్ణించిన జైశంకర్.. స్నేహాన్ని పెంచుకుంటూ, సమస్యలను తగ్గించుకుంటూ ప్రపంచ వేదికపై భారత్ ఓ నమ్మకమైన భాగస్వామిగా వ్యవహరిస్తోందని చెప్పారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. పరస్పర గౌరవం, ప్రయోజనాలు, సుహృద్భావ సంబంధాలు అనే మూడు అంశాలే భారత దౌత్య విధానమని స్పష్టం చేశారు. గత పదేళ్లలో వివిధ దేశాలతో జరిగిన ఒప్పందాలు, ప్రపంచ వేదికలపై భారత్‌కు దక్కిన గుర్తింపే అందుకు నిదర్శనమని చెప్పారు.

# కేజ్రీవాల్ కారుపై రాళ్ల దాడి... బీజేపీ-ఆమ్ ఆద్మీ పార్టీల మాటల యుద్ధం



ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కారుపై రాళ్ల దాడి జరిగింది. ఆయన ఈరోజు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆయన కారుపై రాళ్లను విసిరారు. రాళ్ల దాడిపై ఆమ్ ఆద్మీ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది.
బీజేపీకి ఓటమి భయం పట్టుకుందని ఆమ్ ఆద్మీ పార్టీ ఎక్స్ వేదికగా విమర్శించింది. ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ ఆ పార్టీ ఆందోళనకు గురవుతోందన్నారు. అందుకే కేజ్రీవాల్ ప్రచారాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించింది. కేజ్రీవాల్ ప్రచారం చేస్తుండగా బీజేపీకి చెందిన కొందరు కాన్వాయ్‌పై రాళ్లు రువ్వారని వెల్లడించింది. ఇలాంటి చర్యలకు ఆమ్ ఆద్మీ పార్టీ భయపడదని స్పష్టం చేసింది. ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు బుద్ధి చెబుతారని, ఇందుకు సంబంధించి రాళ్ల దాడి వీడియోను ఆమ్ ఆద్మీ పార్టీ పోస్ట్ చేసింది.
ఈ ఘటనపై బీజేపీ కూడా స్పందించింది. కేజ్రీవాల్ కాన్వాయ్ ఇద్దరు వ్యక్తులను ఢీకొట్టిందని, వీరిని ఆసుపత్రికి తరలించినట్లు బీజేపీ నేత పర్వేశ్ వర్మ తెలిపారు. కేజ్రీవాల్ ముందున్న ఓటమిని గురించి ఆలోచిస్తూ ప్రజల ప్రాణాలకు ఉన్న విలువను కూడా మరిచిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులను కలిసేందుకు తాను ఆసుపత్రికి వెళు తున్నానన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# ఆర్ఎస్ రంగాపురం వివోఏ లక్ష్మి ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిని సస్పెండ్ చేయాలి




ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 18: బేతంచెర్ల పట్టణం వెలుగు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏపిఎం మధు సుదర్శన్ గౌడ్ మరియు సిసి రాజేశ్వరి లను వెంటనే సస్పెండ్ చేసి అరెస్ట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్దర్శులు వి. యేసు రత్నం ఏ.నాగరాజు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వి. బాలవెంకట్ లు డిమాండ్ చేశారు. శనివారం సి ఐ టి యు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్ఎస్. రంగాపురం గ్రామంలో పొదుపు సంఘాల బుక్ కీపర్ గా (వివోఎ గా) విధులు నిర్వహిస్తున్న లక్ష్మిని వెలుగు ఏపీఎం మధు సుదర్శన్ గౌడ్, సీసీ రాజేశ్వరి అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా మారి ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ఉన్న ఫలంగా ఉద్యోగం నుండి తొలగించడం జరిగిందన్నారు.ఎన్నో సంవత్సరాలుగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించు కుంటున్న ఆమెకు ఏ తప్పు లేకపోయినా రాజకీయ కారణాలతో ఉన్నపలంగా ఉద్యోగం నుండి తొలగించడం తో ముందు ముందు కుటుంబాన్ని ఏ విధంగా పోషించుకోవాలో తెలియక తీవ్ర మానసిక ఒత్తిడికి, భయాందోళనకు గురి అయిన ఆమె నిన్నటి దినం విష ద్రావణాన్ని త్రాగి ఆత్మహత్యా యత్నం చేసిందన్నారు. ఇప్పటికీ ఆమె ప్రాణాపాయ స్థితిలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి నందు చికిత్స పొందుతుందన్నారు. వాస్తవానికి వివోఏ లను తొలగించే అధికారం అధికారులకు ఉండదని గ్రామైక్య సంఘం సమావేశంలో తొలగింపుకు ఒప్పుకుంటూ సభ్యులు చేసే మెజార్టీ తీర్మాణము తప్పనిసరి అని వారు అన్నారు.అధికార పార్టీ నాయకుల ప్రాపకం కోసం అధికారులు ఇవేవీ పట్టించు కోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వ గెలుపు చిరు ఉద్యోగుల పాలిట శాపంగా మారిందని ఒక వైపు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మా ప్రభుత్వం లక్షల ఉద్యోగాలు కల్పిస్తుందని రోజ్షు ఆర్భాటంగా ప్రకటనలు గుప్పిస్తూ ఉంటారని అయితే క్రింది స్థాయిలో ఆ పరిస్థితులు లేవని ఉద్యోగ అవకాశాలు ఉన్నచోట కాకుండా ఉన్న ఉద్యోగులను తొలగించి తమ వారిని ఎక్కించుకునే కార్యక్రమాలతో స్థానిక నాయకుల రాజకీయ చదరంగంలో చిరు ఉద్యోగులు బలిపశువులు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఉన్నత విలువలతో మచ్చలేని నాయకుడుగా ఈ రాష్ట్రానికి మంచి పరిపాలన అందించిన మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి తనయుడిగా ఆ కుటుంబం పై ఉన్న అభిమానంతో డోన్ నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే గా కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డిని ఎన్నుకోవడం జరిగిందని ఇటువంటి ఘటనలతో ఆ కుటుంబంపై ప్రజలలో వ్యతిరేకత పెరుగుతుందన్నారు. ఇటీవల కాలంలో కొత్త బురుజు వివోఏ వెంకటరామిరెడ్డి ఘటన మరువకమునుపే ఇటువంటి ఘటనలు పదేపదే పునరావృతం కావడం బాధాకరమని ఇప్పటికే ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డాయని ఇప్పటికైనా చిరు ఉద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలని ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేసి వెంటనే అరెస్టు చయాలని బాదిత కుటుంబానికి న్యాయం చేయాలని లేకపోతే సీఐటీయూ ఆధ్వవర్యంలో అదోళన చేపడతామని అన్నారు.

# భవ సాగరాన్ని దాటించేది భగవన్నామమే

-డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే.



ఆంధ్ర ప్రగతి ఎమ్మిగనూరు జనవరి 18: ప్రాపంచిక మాయ నుండి శాశ్వతమైన ఆనందాన్ని కలిగించేది భగవంతుడి నామమేనని, అటువంటి భగవన్నామస్మరణ ప్రతిజీవి అలవరచుకోవలెనని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు మండలం, రాళ్ళదొడ్డి గ్రామంలోని శివాలయం నందు గత ఐదు రోజులుగా జరుగుతున్న ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక అత్యంత భక్తిశ్రద్ధలతో ముగిశాయి. మూడు రోజులపాటు శ్రీమద్రామాయణం మహాభారతం భగవద్గీతలపై డి. జగదీశ్ చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్ ప్రఖండ అద్యక్షులు సత్యనారాయణ రెడ్డి, మురళి, నర్సన్న, సోమిరెడ్డి, అర్చకులు శ్రీరాములుయాదవ్, గొల్ల గోవిందు, డి.జి వీరన్న, చిన్న తిమ్మప్ప, సోమిరెడ్డి, బోయ వీరేసు, ఈశ్వరయ్య, బోయ వెంకటేశ్ , బోయకాశిమన్న, వీరన్న, చిన్న తిమ్మప్ప, రామకృష్ణ, రమేష్, తిమ్మప్ప, పెద్ద తిమ్మప్ప, బోయశీను, వీరేశ్, కరుణాకర్ రెడ్డి, చెన్నారెడ్డి, భాస్కర్, రవికుమార్, ఈశ్వరయ్య, మూకి తిమ్మప్పతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఎల్ఐసి జాతీయకరణ లక్ష్యాలను కొనసాగించాలి.

**-జీఎస్టీ భారాన్ని తొలగించండి.**
**-జనవరి 20 బిగ్ బిజినెస్ డే పిలుపును జయప్రదం చేద్దాం.**
**-ఎల్ఐసి ఉద్యోగుల సంఘం.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 18: ఎల్ఐసి జాతీయకరణ లక్ష్యాలను కొనసాగించే చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కడప లిఅధ్యక్షులు : వి. ఎస్.ఆర్. శుక్ల కార్యదర్శి ఎ. రమేష్ బాబు ఒక పత్రికా ప్రకటనలో డిమాండ్ చేశారు. జనవరి 19న ఎల్ఐసి జాతీయకరణ జరిగి 69 సంవత్సరాలు పూర్తవుతుందని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. 245 ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీల మోసాల నుంచి ప్రజలను కాపాడేందుకే వాటి స్థానంలో ఒక ప్రభుత్వ రంగ సంస్థగా ఎల్ఐసి ని ఏర్పాటు చేశారని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగ ఎల్ఐసి ని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన బాధ్యత కేంద్రంలోని ప్రభుత్వంపై ఉందని అన్నారు. గత 69 ఏళ్లుగా ప్రజల సొమ్ము,ప్రజా సంక్షేమానికి అనే నినాదంతో ఎల్ ఐ సి సంస్థ,దేశ ఆర్థిక వ్యవస్థ లో 51 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టిందని,అనుక్షణం దేశ సర్వతోముఖాభివృద్ధి కోసం అహరహం పనిచేస్తోందన్నారు. ఆరోగ్యం, బీమా ప్రతి భారతీయుడికి కనీస అవసరాలని హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై జీఎస్టీ భారాన్ని పూర్తిగా తొలగించాలని అన్నారు. ఎల్ఐసి సంస్థకు వెన్నెముకలుగా ఉన్న 14 లక్షల మంది ఏజెంట్ల న్యాయమైన సమస్యలపై వారి సంఘాలతో చర్చించి పరిష్కరించాలని వారు కోరారు. దేశవ్యాప్తంగా సిబ్బంది తగ్గిపోవడంతో పని భారం పెరిగిందని, తక్షణం క్లరికల్, సబ్ స్టాఫ్ రిక్రూట్మెంట్ చేపట్టాలని కోరారు. జనవరి 20 బిగ్ బిజినెస్ డే పిలుపును జయప్రదం చేయండి : ఎల్ఐసి దేశవ్యాప్తంగా ప్రత్యేక వ్యాపార దినంగా జనవరి 20ని ప్రకటించిందని, ఈ పిలుపును జయప్రదం చేయాలని వారు కోరారు. అనేక ఆకర్షణీయమైన నూతన పాలసీలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఎల్ఐసిలో



పాలసీలు తీసుకోవాలని,తద్వారా తమ కుటుంబాలకు బీమా రక్షణ ,దేశ ఆర్థిక వ్యవస్థ కు స్వావలంబన కల్పించాలని వారు కోరారు. బీమా రక్షణకు, రాబడికి, సేవలకు, చెల్లింపులకు నికరమైన ప్రభుత్వ హామీ ఉండడం ఎల్ఐసి ప్రత్యేకతలని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.

# ఘనంగా ఎన్టీఆర్ 29వ వర్ధంతి వేడుకలు.



ఆంధ్ర ప్రగతి మహానంది జనవరి 18:తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి, తెలుగు జాతి ఆరాధ్య దేవుడు, విశ్వ విఖ్యాత నట సార్వభౌముడు స్వర్గీయ నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి వేడుకలను శనివారం మహానంది మండలం లో ఘనంగా నిర్వహించారు..ఈ సందర్భంగా తెలుగు గంగ కాలు సమీపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఉల్లి మధు మాట్లాడుతూ.. తెలుగు జాతి ఖ్యాతిని ఖండాంతరాలుగా వ్యాపింపజేసిన నేత అని, రాజకీయాలకు కొత్త నిర్వచనం చెప్పిన ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతినిధిగా ఖ్యాతి గడించారని, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుబడిన మహానేత ఎన్టీఆర్ అని, ఆయన ఎప్పటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. అదేవిధంగా, ఎన్టీఆర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి కార్యకర్తలు ఎప్పుడు ముందుంటారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగు దేశం మండల నరాల మౌళీశ్వర రెడ్డి మాట్లాడుతూ, కొత్తగా రాజకీయాల్లోకి అడుగులు వేస్తున్న యువతకు ఎన్టీఆర్ ఒక మార్గదర్శి అని, వారి ఆశయాలు, ఆలోచనలు ఎప్పుడు ప్రజల అభివృద్ధికే అని ఆయన అన్నారు. అలాగే, రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి యువతరం ముందు ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనార్దన్ రెడ్డి, ఆర్ఎస్ శ్రీనివాసులు, నాగరాజు, సుదర్శన్ రెడ్డి , చిన్న కాశయ్య, పాశం వెంకటరాజు, హరి ప్రసాద్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# తెలుగు నేలలో నవశకానికి నాంది పలికిన ఎన్టీఆర్

-తెలుగోడి ఆత్మభిమానానికి ప్రతీక “ఎన్టీఆర్.



ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల జనవరి 18: టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి సందర్భంగా శిరివెళ్ల మండల కేంద్రంలోని పెద్దమ్మ మోరి సమీపంలో గల ఉల్లి వెంకటసుబ్బయ్య గారి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీనియర్ టిడిపి పొలిటికల్ లీడర్ మరియు నీటి సంఘం అధ్యక్షులు సూర రామ, విజయ పాల డైరీ డైరెక్టర్ సుర సుబ్బరాయుడు, నీటి సంఘం టిసి మెంబర్ కొత్తపేట జిక్రియా, కె నవీన్ కుమార్ శెట్టి తదితరులు వర్ధంతి వేడుకలలో పాల్గొన్నారు.టిడిపి వారియర్ నేత ఉల్లి వెంకటసుబ్బయ్య గారు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉల్లి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ తెలుగు రాజకీయాలతోపాటు దేశ రాజకీయాలపైన ఎన్టీఆర్ తనదైన ముద్ర వేశారన్నారు.నందమూరి తారక రామారావు సినిమాల్లో ఎవరికీ సాధ్యం కానీ రికార్డులను నెలకొల్పారని. అదే సమయంలో రాజకీయాల్లో అతి తక్కువ సమయంలో పెను సంచలనమే సృష్టించి 13 యేళ్ల రాజకీయ జీవితంలో 4 సార్లు సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారని ఉల్లి వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. 1983, 1984, 1985 వరుసగా మూడేళ్లు ఆంధ్ర ప్రదేశ్గా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఘనత ఎన్టీఆర్కు దక్కుతుందని. ఎన్టీఆర్ రావడంతో రాజకీయాల్లో సినీ నటులకు విలువ పెరిగిందన్నారు.ప్రాంతీయ పార్టీలకు దేశ వ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చిన ఘనత ఎన్టీఆర్ కే దక్కుతుందని. తెలుగు దేశం పార్టీ అధినేతగా చైతన్య రథంపై ఆయన చేసిన యాత్రసంచలనం సృష్టించిందన్నారు. ఎన్టీఆర్ ప్రసంగాల్లో తొలి పలుకులను ఉల్లి వెంకటసుబ్బయ్య స్మరించుకున్నారు. తెలుగు జనతకు వందనం.. తెలుగు యువతకు అభివందనం.. తెలుగు మమతకు అభినందనం.. తెలుగు జాతికి శుభాభివందనం’ అనే మాటలు తెలుగోడి సత్తాను జగమంతా చాటిందని గుర్తు చేస్తూ హాజరైన టిడిపి నాయకులకు కార్యకర్తలకు వివరించారు. 1982లో తెలుగు దేశం పార్టీ పేరుతో పార్టీని స్థాపించి 1983లో తెలుగు నేలపై మొట్టమొదటి కాంగ్రెసేతర సీఎంగా ఎన్నికై ఉమ్మడి ఏపీలో నవశఖానికి నాంది పలికారని ఉల్లి వెంకటసుబ్బయ్య తెలియ జేశారు.

# నా పిల్లల్ని ఆదుకోండని అభ్యర్థిస్తున్న క్యాన్సర్ బాధితురాలు దేవనగర్ లక్ష్మమ్మ





ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 18: నంద్యాల గ్రామం దేవనగర్ కు చెందిన నిరుపేద లక్మమ్మ,వెంకటేశ్వర్లు చిత్తుకాగితాలు సేకరిస్తూ అనేక సంవత్సరాలుగా జీవనం కొనసాగిస్తున్నారు. వారికి 5 గురు సంతానం ముగ్గురు మొగపిల్లలు,ఇద్దరు కూతుర్లు అయితే ఇటీవల ఆమెకు ఆరోగ్యం క్షీణించటం తో ప్రభుత్వ హాస్పిటల్ లో చూపించుకోగా క్యాన్సర్ అని తేలిందని, అది తీవ్రస్థాయిలో ఉందని చెప్పారని మందులు వాడే పరిస్థితి లేకపోవటం భర్త పూర్తిగా మద్యానికి బానిస అయి ఇంటికి ఎప్పుడు,ఎన్నిరోజులకు వస్తాడో తెలియదని,బాడుగ ఇంట్లో ఉంటున్నామని,ఆరోగ్యం సహకరిచకపోయినా పిల్లలకోసం పేపర్లు సేకరించుకొని అమ్మి వచ్చే వాటితోనే జీవనం కొనసాగిస్తున్నామని పక్కింటి వాళ్ళు పెట్టె భోజనం తింటూ బ్రతుకుతున్నామని ప్రభుత్వం కానీ దాతలు కానీ ఆదుకొని మాకు ఉండేందుకు ప్రభుత్వం ఓ ఇల్లు కేటాయించాలని,దాతలు సహకరిస్తే క్యాన్సర్ కు ఆపరేషన్ చేపించుకుంటానని నీరసించిన స్వరంతో అభ్యర్ధియించారు.దేవనగర్ వాల్మీకులు లక్షమమ్మ దీనగాదను వారం క్రితం వాల్మీకి సంఘ నేత పులికొండన్న దృష్టికి తేవటంతో వెంటనే స్పందించిన ఆయన ఇతరనేతలకు తెలిపి తక్షణం వారికి లాయర్ హరి,విజయ్ ఎలక్ట్రానిక్స్,పులికొండన్న ల ఆధ్వర్యంలో 7 దుప్పట్లు ,2 టిక్కీల కర్నూల్ సోన పాతబియ్యం (ఒకటి గోస్పాడు దేవనాథ్ రెడ్డి,ఇంకొకటి నాగరాజు చాబోలు)లాయర్ బోయ సుబ్బారాయుడు ద్వారా 3000 రూపాయలతో పిల్లలకు బట్టలు,లాయర్ కాశయ్య (ప్రకాశం)10 కిలోల కందిపప్పు,శ్రీరామ శారీ సెంటర్ వెంకటేశ్వర్లు ద్వారా 9 చీరెలు ఈ రోజు వారికి అందించారు,సేకరించిన డబ్బులు సోమవారం వారికి అప్పగిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా పులికొండన్న మాట్లాడుతూ ఈ కుటుంబం దీనావస్థలో ఉందని ప్రభుత్వం మరియు దాతలు ఆదుకోవాలని,పిల్లలకు సరైన పోషకాలు అందక వారి మానసిక పరిస్థితి కూడా బాగా లేదని,ఇప్పటికే సోసియల్ మీడియాలో తెలిపామని ప్రభుత్వం ఇలాంటి పేదవారిపట్ల దృష్టి పెట్టి ఆదుకోవాలని మంత్రి ,ఎంపీ ఈ దీనురాలిని స్వయంగా కలిస్తే వారికే అర్థమౌతుందని కొండన్న కోరారు,వాల్మీకి మహిళా నాయకురాలు బోయ భారతి మాట్లాడుతూ ఇలాంటి దుస్థితి ఏ కుటుంబానికి రావొద్దని,ఈ కుటుంబంలో 7 గురు ఉన్నా 4 గురికి మాత్రమే ఆధార్,రేషన్ కార్డ్ నలుగురి పేరు మీదనే ఉందని మరి సచివాలయ సిబ్బంది ఏమి చేస్తున్నట్లు అని ప్రశ్నించారు,తక్షణం వీరికి ప్రభుత్వం పక్కా గృహం కేటాయించాలని,ఇలాంటి పేదలకు సహాయం అందినప్పుడే ప్రజాస్వామ్యం అనిపించుకుంటుందని కనుక లక్షమమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం,దాతలు ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తూ సాటి మహిళా గా ఆమెను ధైర్యంగా ఉండాలని మీకు సహాయం అందేలా అన్ని ప్రయత్నాలు చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో వాల్మీకి నేత లాయర్ బోయ సుబ్బారాయుడు,నగేష్,శ్రీనివాసులుమహాలక్ష్మి,,పెద్దక్క, రాణి,మాధవి,మద్దమ్మ,వెంకటమ్మ, అను తదితరులు పాల్గొన్నారు.

# ఇంటితో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

**-స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**









**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 18:**
మన ఇంటితో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ నంద్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణమంతా కలియతిరిగి పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని నివాసిత ప్రాంతాలు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, పాఠశాలలు, ఆసుపత్రులు ,బస్ స్టాపులు, రైల్వేస్టేషన్లు, పరిశ్రమలు తదితర ప్రభుత్వ మరియు ప్రైవేటు కార్యాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ఈ నెల నుండి 12 నెలల పాటు నెలకు ఒక థీమ్ తో స్వచ్ఛత కార్యక్రమం చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. జనవరి మాసానికి సంబంధించి న్యూ ఇయర్ - క్లీన్ స్టార్ థీమ్ తో కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ జిల్లావ్యాప్తంగా పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టామన్నారు. పర్యావరణ పరిరక్షణ అంశంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటు చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. పట్టణాలలో ఉన్న పెద్ద పెద్ద గార్బేజ్ పాయింట్లను తొలగించి వాటి స్థానంలో మొక్కల్ని నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. హెల్తీ స్టేట్- హ్యాపీ స్టేట్ లో భాగంగా ప్రజలు ఎప్పుడు ఆరోగ్యంగా, ఆనందంగా, సంతోషంగా ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రతి ఇంటి నుండి సేకరించిన చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా విభజించి తడి చెత్త నుంచి కంపోస్ట్ తయారు చేసి సంపద సృష్టించే కార్యక్రమం చేపడతామన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై ప్రభుత్వం సంకల్పించిన లక్ష్యానికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. బస్టాండ్ ప్రాంగమంతా కలియ తిరుగుతూ ప్లాట్ఫామ్స్, దుకాణాలు, హోటళ్లు, చిరు షాపులన్నిటిని పరిశీలించి చెత్తాచెదారాన్ని తొలగించే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. దుకాణదారులతో మాట్లాడుతూ వేస్ట్ మెటీరియల్ ను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా చెత్తకుండీల్లో వేసేందుకు పెద్దపెద్ద చెత్తకుండీలను ఏర్పాటు చేసి సైన్ బోర్డులు ప్రదర్శించాలన్నారు. కలెక్టర్ వెంట స్వచ్ఛత కార్యక్రమంలో పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ రజియా సుల్తానా, డిపో మేనేజర్ గంగాధర్, వార్డ్ కౌన్సిలర్ శేషయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు నంద్యాల మున్సిపల్ కార్యాలయము నుండి మున్సిపల్ టౌన్ హాల్ వరకు నిర్వహించిన స్వచ్ఛత భారీ ర్యాలీని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారితో పాటు ఎమ్మెల్సీ ఇసాక్ బాషా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మధ్యాహ్నం సమయంలో కలెక్టరేట్ ముఖ ద్వారం నుండి పిజిఆర్ఎస్ సెంటినరీ హాలు, కలెక్టర్ కార్యాలయ పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేసే కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డిఆర్ఓ రాము నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, కలెక్టరేట్ కార్యాలయపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కార్యాలయం సిబ్బంది అందరి చేత స్వచ్ఛంద ప్రతిజ్ఞ ను కలెక్టర్ చేయించారు.

## ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి.

**-జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జనవరి 18:**
జిల్లావ్యాప్తంగా నిరుద్యోగ యువతకు ఉపాధి నైపుణ్య అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పీఎం ఇంటర్న్ షిప్ పథకాన్ని ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల యువతీ యువకులు ఈనెల 21వ తేదీలోగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక పోర్టల్ https://pminternship.mca.gov.in/login లాగిన్ అయి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ స్కీంలో ఎంపికైన అభ్యర్థులు దేశంలోని టాప్ 500 కంపెనీల్లో ఇంటర్న్ షిప్ అవకాశాలను కల్పిస్తామన్నారు. వన్ టైం గ్రాంట్ కింద 6000 రూపాయలతో పాటు ప్రతి నెల 5000 రూపాయలు స్టైఫండ్ కూడా చెల్లించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎస్ఎస్సి, హెచ్ ఎస్ సి, ఐటిఐ, పాలిటెక్నిక్, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బీఫార్మసీ తదితర గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు 21 నుండి 24 ఏళ్ల మధ్య వయస్సు కలిగి వుండి వార్షిక ఆదాయం 8 లక్షల లోపు ఉండాలన్నారు. ఇతర వివరాలకు 6300324076, 8297812530 మొబైల్ నంబర్లను సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎంపీ డాక్టర్ బైరెడ్డి కార్యాలయంలో ఘనంగా ఎన్ టీ ఆర్ వర్ధంతి వేడుకలు

**-ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అభిమానుల మెగా రక్తదానం.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 18:
తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, పేద ప్రజల అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన దివంగత ముఖ్యమంత్రి, పద్మశ్రీ నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి కార్యాలయం ఘనంగా శనివారం నిర్వహించారు.నంద్యాల పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి ఆదేశాల మేరకు నంద్యాల బొమ్మల సత్రంలోని ఎంపీ నివాసం నందు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కార్యాలయ ఇంచార్జి, మాజీ కౌన్సిలర్ నరహరి విశ్వనాథ రెడ్డి , దినేష్ రెడ్డి, గణపం పుల్లారెడ్డి, అజయ్, సూరి, బి ఎస్ ఎన్ ఎల్ సలహా కమిటీ సభ్యులు పెరుమాళ్ళ విజయ్ కుమార్, కోడూరు సంజీవరెడ్డి, వార్డ్ ఇన్చార్జి శ్రీనివాస యాదవ్ ,పోలూరు నాగేశ్వరరెడ్డి , భగీరథ రెడ్డి, నాగేశ్వరనాయక్, శ్రీనివాస రావు, మనోజ్, కల్యాణ్ , సాయి, హర్షవర్ధన్ రెడ్డి, హేమంత్ ,తేజ తదితర 30 మంది ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అభిమానులు, అనుచరులు రక్తదానం చేశారు.



## కామ్రేడ్ టి.నరసింహయ్య ఆశయ సాధనకై కృషి చేయాలి




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 18:**
సిపిఎం ఉమ్మడి కర్నూలు జిల్లా ఉద్యమ నిర్మాత, నిరంతరం ప్రజాసేవకు అంకితమై ప్రజలందరికీ కూడు,గూడు, విద్య,వైద్యం అందుబాటులోకి రావాలని, పెట్టుబడుదారి సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో పికిలించి సోషలిస్టు రాజ్య స్థాపనకై అహర్నిశలు కృషిచేసిన కామ్రేడ్. తెలకపల్లి నరసింహయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్ అన్నారు. సిపిఎం కార్యాలయంలో పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన తెలకపల్లి నరసింహయ్య ఆరవ వర్ధంతి సభలో సిపిఎం సీనియర్ నాయకులు తోటమద్దులు, జిల్లా కమిటీ సభ్యులు పుల్లా నరసింహులు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కె. మహమ్మద్ గౌస్,పార్టీ కార్యకర్తలు సత్యం, రంగడు, శ్రీనివాసులు, ఓబులేసు వీరితోపాటు మరికొంతమంది పాల్గొనడం జరిగింది. ముందుగా తెలకపల్లి నరసింహయ్య చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్, సీనియర్ నాయకులు తోట మద్దులు పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ తెలకపల్లి నరసింహయ్య సిపిఐ నుండి సిపిఎం పార్టీ ఏర్పడిన తర్వాత మళ్లీ సిపిఐ (ఎంఎల్) గా విడిపోయిన నాటినుండి జిల్లా మొత్తం తిరిగి ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుతూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారని కార్యకర్తలను తమ కుటుంబం లో ఒకరిగా భావించి నిరంతరం వారి కష్టాలలో పాలుపంచుకొని ముందుకు పోయేలా కృషి చేశారని నేటి తరానికి ఆదర్శప్రాయుడిగా నిలిచి రాయలసీమ జిల్లాలో అనేక ప్రాజెక్టుల నిర్మాణానికి ఎనలేని కృషి చేసిన గొప్ప మహనీయుడని, జిల్లాలో అనేక రకాల ఫ్యాక్టరీలను నిర్మించి జిల్లా అభివృద్ధి కోసం కృషి చేయాలని పోరాటం చేయడంతో పాటు ఆయన రైతుల సమస్యల పరిష్కారం కోసం పంట కాలువల నిర్మాణానికి, రిజర్వాయర్ల, ప్రాజెక్టుల నిర్మాణానికి ప్లాన్ చేస్తూ నిరంతరం పోరాటం చేస్తున్న నరసింహయ్య గారి కృషికి అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తో సహా గౌరవించి ఆయన చేసిన వినతులపైన వెంటనే అధికారులు చర్యలు తీసుకునేలా రైతులకు న్యాయం జరిగేలా చూసే వారని, అంతటి మహానుభావుడు తెలకపల్లి నరసింహయ్య గారు కలలుగన్న సోషలిస్టు రాజ్యస్థాపనకై సిపిఎం పార్టీ కార్యకర్తలందరూ కృషి చేయాలని అప్పుడే ఆయనకు నిజమైన నివాళులు అర్పించిన వారం అవుతామని అన్నారు.

## విజయ పాల డైరీ చైర్మన్ పదవి ఒకే కుటుంబానికేనా..?

**-40 ఏళ్లుగా ఎస్సీ ఎస్టీ, బిసి లకు. మైనార్టీలకు లేరా .?**
**-40 ఏళ్ల గా కుటుంబ పాలన లో జరిగిన అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 18:
నంద్యాల జిల్లాలోని విజయ డైరీలో గత 40 ఏళ్లుగా ఉన్నత వర్గాలకే కుటుంబ పాలనగా చైర్మన్ పదవి వరిస్తుందని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అణగారిన వర్గాలకు మొండి చెయ్యి చూపుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు ఆరోపించారు.
నంద్యాల పట్టణ సిపిఐ కార్యాలయంలో శనివారం కాంగ్రెస్, సిపిఐ ముఖ్య నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు లక్ష్మీ నరసింహ యాదవ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్. కాంగ్రెస్ నంద్యాల నియోజకవర్గ బాధ్యుడు సీ. పుల్లయ్య పాల్గొన్నారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ..
1983లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విజయ పాల డైరీ ని స్థాపించి ఏర్పాటు చేశారని అప్పటినుండి నేటి వరకు ఒకే కుటుంబ పాలనగా ఒకే వర్గానికి చెందిన వారికి పదవి దక్కుతుందని ఒక వర్గం గొడవ సృష్టించడంతో డైరెక్టర్ల ఎన్నికలను వాయిదా వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. భూమా జగత్ విఖ్యాత్ రెడ్డిని డిఫాల్ట్ గా ప్రకటించినందున ఆయన వర్గీయులు ఎన్నికను అడ్డుకోవడం చూస్తుంటే భూమా విఖ్యాత్ రెడ్డి వర్సెస్ ఎస్వీ జగన్మోహన్ రెడ్డి. మాదిరిగా మారిపోయాయని వారన్నారు.జగత్ విఖ్యాత్ రెడ్డి గాని వారి మేనమామ , జగన్మోహన్ రెడ్డి గాని పాల ఉత్పత్తిదారులు కాదని కేవలం పార్టీల సపోర్టుతోనే చైర్మన్ పదవికి పోటీ పడుతున్నారని అన్నారు. విజయపాల డైరీలో అక్రమాలు చోటుచేసుకున్నాయని అధికార పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారని ఈ ఆరోపణలపై ముఖ్యమంత్రి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, అలాగే గత 40 సంవత్సరాలుగా డైరీలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే ఏ ప్రభుత్వంలోనూ ఎస్సీ ఎస్సీ బీసీలకు దక్కలేదని ఇప్పటికైనా వారికి చైర్మన్ పదవి దక్కేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు.
న్యాయశాఖ మంత్రి ఎన్.ఎండి. ఫారుక్ ఇలాఖాలోనే ఎన్నికలు వాయిదా పడ్డాయి అంటే అర్థం చేసుకోవచ్చన్నారు. ఇద్దరు మంత్రులు ఉన్న జిల్లాలో ఎన్నికలు సజావుగా సాగకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా మంత్రులు కలెక్టర్ జోక్యం చేసుకొని ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని వారు కోరారు. త్వరలో అన్ని పార్టీల నాయకులతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి విజయ పాల డైరీ ని సందర్శిస్తామని పై నాయకులు తెలిపారు.

## కానిస్టేబుల్ రిక్రూట్మెంట్ లో గాయపడిన అమ్మాయిని హాస్పిటల్ కి తరలించిన సత్యసాయి జిల్లా ఎస్పీ.

**-మెరుగైన వైద్యం కోసం మదనపల్లి హాస్పిటల్ కు తరలింపు.**




ఆంధ్ర ప్రగతి చిత్తూరు జిల్లా జనవరి 18:
చిత్తూరు జిల్లాలో జరుగుతున్న పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్మెంట్ సమయంలో ఓ మహిళ గాయపడడంతో వెంటనే చిత్తూరు జిల్లా పోలీస్ రిక్రూట్మెంట్ ఇంచార్జ్ సత్యసాయి జిల్లా ఎస్పీ శ్రీమతి వి.రత్న ఐపీఎస్ గారు సంబంధిత సిబ్బంది ద్వారా హుటాహుటిన వెంటనే వైద్యం నిమిత్తం హాస్పిటల్ కి తీసుకెళ్లారు. వాయల్పాడు కు చెందిన షకీలా ఈరోజు జరిగిన కానిస్టేబుల్ పోలీస్ రిక్రూట్మెంట్ పోటీలలో 1600 మీటర్ల పరుగు పందెంలో కాలుజారి కింద పడ్డారు అయితే ఆమెకు ఫ్రాక్చర్ కావడంతో వెంటనే ఇంచార్జ్ గా విధులు నిర్వహిస్తున్న ఎస్పీ ఈ సమాచారం పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ శ్రీ రవి ప్రకాష్, ఐపీఎస్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. చిత్తూరు హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న ఆమెను పరామర్శించి వైద్యులను సంప్రదించి వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకున్నారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం ఎస్పీ గారు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆమెను మదనపల్లిలోని హాస్పిటల్ కు తీసుకెళ్లేందుకు కావలసిన ఏర్పాట్లను చేసి గాయపడిన మహిళను వాహనం ద్వారా మదనపల్లి పంపించారు.

# తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్..!

**-ఎన్టీఆర్ 29 వ వర్ధంతి సందర్భంగా పేదలకు ఉచిత వైద్య శిబిరం, బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు.**

**-ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎన్ఎండి ఫిరోజ్.**













ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 18: తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక నందమూరి తారక రామారావు అని, గల్లి నుంచి ఢిల్లీ దాకా తెలుగువారి సత్తా చాటారంటూ ఎన్టీఆర్‌ని కొనియాడారు. నంద్యాల శ్రీనివాస్ సెంటర్ ఎన్టీఆర్ కాంప్లెక్స్ దగ్గర ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , ఏపీ సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి , దూదేకుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ బాబాన్ , టిడిపి రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు , కలరాధన అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ .

ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ చరిత మరువని నటనా కౌశలం.. తెలుగు వారిపై మమకారంతో టిడిపి పార్టీని స్థాపించిన ఎనిమిది నెలల్లోనే అధికార కైవసం చేసుకున్న గొప్ప వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు .. ఇలా మాట్లాడుకుంటే స్ఫురణకు వచ్చే ఒకే ఒక పేరు నందమూరి తారక రామారావు అని అన్నారు. అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన ప్రారంభించిన రూ.2 లకే కిలో బియ్యం పథకం ఎంతో మేలైనది, ఎందరికో అనుసరణీయమైంది" అని చెప్పారు. ఢిల్లీ రాజకీయాల్లో గుర్తింపునకు నోచుకోక, తెలుగు జాతి ఖ్యాతి మసకబారుతున్న తరుణంలో తెలుగువారి 'ఆత్మ గౌరవం' అనే నినాదంతో ఎన్నికల బరిలో ఎన్టీఆర్ నిలిచారని గుర్తు చేశారు. పార్టీ పెట్టిన ఎనిమిది నెలల్లోనే అజేయమైన విజయాన్ని అందుకుని, తెలుగువారి సత్తాను ఢిల్లీ దాకా చాటారని కీర్తించారు. అటు సినిమా, ఇటు రాజకీయ రంగాల్లో తనదైన ముద్ర వేసిన ఎన్టీఆర్.. తెలుగు బిడ్డగా జన్మించడం తెలుగువారందరికీ గర్వకారణమని అన్నారు. ఎన్టీ రామారావు అందించిన ప్రజాహిత పరిపాలన దక్షతే నేటి యువతకు ఆదర్శనీయమని పేర్కొన్నారు. రాజకీయ నేతగా ప్రత్యేకత చాటుకున్న ఎన్.టి.రామారావు ఏళ్లు గడుస్తున్న తెలుగు వారి గుండెల్లో తన స్థానాన్ని పదులపరుచుకున్నారని చెప్పారు. అనంతరం తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు ఉచిత వైద్య శిబిరాన్ని మరియు బ్లడ్ డొనేషన్ క్యాంప్ ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో టిడిపి కౌన్సిలర్లు , మాజీ కౌన్సిలర్లు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, నందమూరి, బాలకృష్ణ అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కంప్యూటర్ కోర్సు అడ్మిషన్లు ప్రారంభం



ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 18:

నంద్యాల పట్టణంలోని అల్ మద దు ఫౌండేషన్ చైర్మన్ ఆకుమల్లా రహీమ్ ఆధ్వర్యంలో నదుపబదుతున్న అల్ మద దు కంప్యూటర్ సెంటర్ లో ఒన్ ఇయర్ డిప్లొమా ఇన్ కంప్యూటర్ కోర్సు కు అడ్మిషన్ లకు సంబంధించిన గోడ పత్రికను నేషనల్ విద్య సంస్థ ల అధినేత డాక్టర్ ఇంతియాజ్ అహమద్ నేషనల్ కళాశాల ఆవరణములో నేడు విడుదల చేయడం జరిగింది.డాక్టర్ ఇంతియాజ్ అహమద్ మాట్లాడుతూ నేటి సమాజంలో కంప్యూటర్ విద్య అన్నది ప్రతి విద్యార్థికి అత్యవసరమైనది. నంద్యాల పట్టణంలోనీ అల్ మదదు కంప్యూటర్ సెంటర్ లో కోర్సు పూర్తి చేసిన వారికి కేంద్ర ప్రభుత్వము చే గుర్తింపు కల్గిన నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇంపెర్మేషన్ టెక్నాలజీ అనే సంస్థ చే గుర్తింపు కల్గిన సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుంది,ఈ కంప్యూటర్ సర్టిఫికెట్ చాలా విలువైనది కావున ఇలాంటి కంప్యూటర్ సెంటర్ మన నంద్యాలలో ఉండడము చాల గొప్ప విషయం.ఈ అల్ మద దు కంప్యూటర్ సెంటర్ నడుపుతున్న సెంటర్ ఇన్చార్జి ఆకుమాల్లా రహీమ్ కు అభినందనలు తెలిపారు.కావున నంద్యాల పట్టణ పరిసర ప్రాంతాల విద్యార్థులు, యువకులు అల్ మద దు కంప్యూటర్ సెంటర్ ను సందర్శించి అడ్మిషన్లు తీసుకొని ఉద్యోగ అవకాశాలు పొంది సమాజములో ఉన్నత స్థానంలో ఉండే విధముగా ప్రయత్నం చేయాలని కోరారు. అల్ మద దు ఫౌండేషన్ వారు గత పద హైడు సంవత్సరాల నుండి సమాజములో అనేక సామాజిక అంశాలు మీద పనిచేస్తూ ఉన్నదని కొనియాడారు.

రహీమ్ మాట్లాడుతూ.. జనవరి బ్యాచ్ లో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీష్ కూడా నేర్పించడం జరుగును అని తెలిపారు.మా కంప్యూటర్ సెంటర్ శోభా లాడ్జ ప్రక్కన ఆర్పీ కాంప్లెక్స్ ఫస్ట్ ఫ్లోర్ , ఎన్ కెరోడ్ నందు కలదని.అడ్మిషన్లకు చివరి తేదీ జనవరి 30 తేదీ .కావున జనవరి చివరి లోపు అడ్మిషన్ కొరకు సంప్రదించ నంబర్ 9059583777,9440043839 సంప్రదించ.ఈ కార్యక్రమంలో నేషనల్ విద్య సంస్థ ల అధినేత డాక్టర్ ఇంతియాజ్ అహమద్, నేషనల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ,కళాశాల సిబ్బంది లెక్చరర్ షబ్బీర్ అహ్మద్, లెక్చరర్ నసీరుద్దీన్ మరియు ఆల్ మద దు ఫౌండేషన్ చైర్మన్ ఆకు మల్ల రహీమ్, సభ్యులు రహంతుల్లా, ఫ్యాకల్టీ అబ్దుల్ మజీద్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

**-అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి.**

**-ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాముడు.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 18: శ్రీకాకుళంలో ఫిబ్రవరి 6,7,8,9 అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలనీ స్థానిక నంద్యాల జిల్లా సిపిఐ కార్యాలయంలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య నంద్యాల జిల్లా కార్యదర్శి జి నాగరాముడు మాట్లాడుతూ యువతి యువకులకు అందరికి,ఉచితవిద్య, వైద్యం, ఇవ్వాలని కోరారు.ఫిబ్రవరి నెలలో 6వ తేదీ నుండి 9వ తేదీ వరకు జరగబోయే రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ మహాసభలకు నంద్యాల పట్టణంనుండి అలానే జిల్లా నుండి పెద్ద ఎత్తున యువతి యువకులు రాష్ట్ర మహాసభలో పాల్గొని విజయవంతానికి తమ వంతు బాధ్యతగా అందరూ కృషి చేసి జయప్రదం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐపట్టణ కార్యదర్శి కే ప్రసాదుఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కే భాస్కర్, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు విష్ణు రవికుమార్ ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రి స్వామి నాయకులు మాస్, సురేంద్ర ,బాబుతదితరులు పాల్గొన్నారు.

### ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో

# 29వ ర్యాంక్ సాధించిన రైతు బిడ్డ

**అభినందనలు తెలిపిన రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు మేకల. లింగస్వామి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 18:**

నంద్యాల మండల పరిధిలోని చాబోలు గ్రామానికి చెందిన రైతు కడియం జనార్ధన్, మాణిక్యమ్మల మూడో సంతానం విజ్ఞాన్ తరుణ్ కు న్యూరో డి. ఎం ఫిజీషియన్ కోర్సులో ఆల్ ఇండియా మెడికల్ సైన్సెస్ - న్యూఢిల్లీ నందు అల్ ఇండియా స్థాయి లో 29 వ ర్యాంక్ సాధించారు. గ్రామస్థాయి నుంచి వెళ్లి జాతీయస్థాయిలో గ్రామానికి మంచి పేరు తీసుకురావడం పట్ల గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలతోపాటు రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు మేకల. లింగస్వామి తదితరులు అభినందించారు.

విజ్ఞాన్ తరుణ్ ఒకటో తరగతి నుండి పదవ తరగతి వరకు శ్రీ నవ చైతన్య స్కూల్ ఎన్జీవోస్ కాలనీ(565 మార్కులు), విజయవాడలోని శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్(956 మార్కులు), కర్నూల్ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్, ఎండి జనరల్ మెడిసిన్ లో విద్యా న భ్యసించారు. ప్రస్తుతం ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ - న్యూఢిల్లీ నందు న్యూరాలజీ కోర్స్ లో 29వ ర్యాంకు సాధించడం సంతోషకరమని అభినందనలు తెలిపారు. రైతు కుటుంబమైన కడియం జనార్ధన్, మాణిక్యం లకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతురులు. పెద్ద కుమారుడు వినోద్ కుమార్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ నంద్యాల నందు డిప్యూటీ మేనేజర్ గా పని చేయుచున్నారు. మూడవ కుమారుడే ఈ విజ్ఞాన్ తరుణ్. ఇద్దరు కూతుర్లు రైతు కుటుంబం నుంచి వచ్చిన విజ్ఞాన్ తరుణ్ సాధించిన విజయం పట్ల కుటుంబ సభ్యులు బంధువులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### నంద్యాల సబ్ డివిజన్ ఎస్ డి పి ఓ గా

# బాధ్యతలు చేపట్టిన జావలి



**ఆంధ్ర ప్రగతి నంద్యాల క్రైమ్ జనవరి 18:**

2022 బ్యాచ్ చెందిన చెందిన జావలి ఐపీఎస్ శనివారం నాడు నంద్యాల సబ్ డివిజన్ ఎస్డిపిఓ గా బాధ్యతలు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా జావలి ఐపీఎస్ గారు మాట్లాడుతూ నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ నేర నియంత్రణకు కృషి చేస్తానని ఒక మహిళ అధికారిగా మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయడం జరుగుతుందని, ప్రజలకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు నేరుగా నన్ను సంప్రదించవచ్చునని సబ్ డివిజన్ పరిధిలో ఏదైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్న ఎడల సమాచారం అందించాలని మీడియా ప్రతినిధులకు మరియు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# పొగాకు షెడ్లు కు నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తులు.

**-పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి.**



ఆంధ్ర ప్రగతి గడివేముల జనవరి 18: గడివేముల మండలం పై బోగుల గ్రామంలో పొగాకు షెడ్లు కు నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించిన నంద్యాల జిల్లా అధ్యక్షులు మరియు పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పరిశీలించారు.శనివారం నాడు గడివేముల మండలం పై బోగుల గ్రామంలో నిన్న రాత్రి సమయంలో వెంకటేశ్వర్లు, ఈశ్వరయ్య, సూరి ఈ ముగ్గురికి సంబంధించిన పొగాకు పంట (7 పొగాకు షెడ్లు)ను నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు బూడిద అయ్యిన పొగాకు షెడ్లు దాదాపు 12 లక్షలు విలువ చేసే పంట బూడిది అయ్యింది. చేతికి వచ్చిన పంట 2,3 రోజుల్లో అమ్ముకొనే పంట అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాటసాని రాంభూపాల్ రెడ్డి నష్టపోయిన రైతులను పరామర్శించి. పోలీసు వారిని కోరుతున్నది ఒక్కటే నిప్పంటించిన వారిపై కఠిన చర్యలు తీసుకొని నష్టపోయిన రైతులకు నిప్పు అంటించిన వారితోనే నష్టపరిహారం చెల్లించేలా చూడాలని పోలీసువారికి వైఎస్ఆర్ సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు శ్రీ కాటసాని రాంభూపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గడివేముల మండల నాయకులు పైబొగుల గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

## వినీలాకాశంలో ఆవిష్కృతమవనున్న

# అద్భుత దృశ్యం!

ఈ నెల 22న వినీలాకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతం కాబోతున్నది. ఒకే వరుసలోకి ఆరు గ్రహాలు వచ్చి కనువిందు చేయనున్నాయి. ఆయా గ్రహాలు ఎలాంటి బైనాక్యులర్ల సహాయం లేకుండానే నేరుగా చూసేందుకు అవకాశం ఉంటుంది. ఈ నెల 22వ తేదీ నుంచి 31 వరకు గ్రహాలు ఒకో వరుసలోకి రాబోతున్నాయి. గ్రహాలు ఒకేవరుసలో చాలా అరుదుగా కనిపిస్తాయి. గ్రహాలు ఒకే వరుసలోకి రావడాన్ని ప్లానెటరీ అలైన్‌మెంట్‌గా ఖగోళ నిపుణులు పేర్కొంటున్నారు. శుక్రుడు, అంగారకుడు, బృహస్పతి, శని, యురేనస్, నెప్ట్యూన్ గ్రహాలు ఒకే వరుసలోకి రానున్నాయి. చాలా అరుదుగా గ్రహాలన్నీ ఒకే వరుసలోకి వస్తుంటాయి. ఈ దృగ్విషయాన్ని ప్లానెటరీ అలైన్‌మెంట్, పరేడ్ ఆఫ్ ప్లానెట్స్‌గా పిలుస్తుంటారు. వాస్తవానికి గ్రహాలకు మధ్య భారీగానే దూరం ఉంటాయి. గ్రహాలు ఏవీ అంతరిక్షంలో వరుస క్రమంలో ఉండవు. కానీ, మనకు భూమిపై నుంచి చూసిన సమయంలో ఒకే వరుసలో దర్శనమిస్తాయి. ఈ దృశ్యాన్ని బైనాక్యులర్స్ ద్వారా చూస్తే మాత్రం మరింత స్పష్టంగా కనిపిస్తాయి. శుక్రుడు, కుజుడు, బృహస్పతి, శని, యురేనస్, నెప్ట్యూన్‌లను చూసేందుకు ఫిబ్రవరి ప్రారంభం ఉత్తమమైన సమయంగా ఖగోళ నిపుణులు పేర్కొంటున్నారు.

ఇక మార్చిలో అరుణగ్రహం, బృహస్పతి, యురేనస్, వీనస్, నెప్ట్యూన్, శని, మెర్క్యూరీ గ్రహాలు ఒకేవరుసలోకి వచ్చి కనువిందు చేయనున్నాయి. దీన్ని గ్రేట్ ప్లానెటరీ అలైన్‌మెంట్‌గా పిలుస్తారు. ఈ ఖగోళవిందును టెలిస్కోప్ సహాయం లేకుండా చూడొచ్చు. కానీ, స్పష్టంగా నాలుగు గ్రహాలు మాత్రమే కనిపిస్తాయి. నెప్ట్యూన్, యురేనస్ గ్రహాలను చూసేందుకు టెలిస్కోప్ అవసరమవుతుంది. సూర్యాస్తమయం తర్వాత రాత్రి 8.30 గంటల నుంచి ఆకాశంలో ఈ అద్భుత




దృశ్యం ఆవిష్కృతమవుతుంది. ఆ సమయంలోనే అన్ని గ్రహాలు ఒకేవరుసలో దర్శనమిస్తాయి. రాత్రి 11.30 గంటల తర్వాత మళ్లీ కనిపించవు. కానీ, బృహస్పతి, మార్స్, యురేనస్ గ్రహాలు కనిపిస్తాయి. ఆ తర్వాత మళ్లీ కనిపించకుండా పోతాయి. ఈ నెల 22 నుంచి 31 వరకు ఆయా గ్రహాలను భూమిపై నుంచి నేరుగా చూడొచ్చు. శని, బుధుడు, నెప్ట్యూన్ సూర్యాస్తమయం సమయంలో సూర్యుడికి దగ్గరగా వెళ్తాయి. మెర్క్యూరీ, శని, నెప్ట్యూన్ సూర్యుడికి చాలా దగ్గరగా వెళ్లడంతో గ్రహాలు భూమిపైకి కనిపించడం తగ్గిపోతుంది. శుక్ర గ్రహం సైతం అంతగా కనిపించేందుకు ఛాన్స్ ఉండదు. బృహస్పతి, అంగారకుడు, యురేనస్ సైతం మాత్రమే కొద్దివారాల పాటు అలాగే ఉంటాయి. ఈ అరుదైన దృశ్యాన్ని అమెరికా, మెక్సికో, కెనడా, భారత్‌లో చూసేందుకు అవకాశం ఉంది. జనవరి 22 నుంచి 31 వరకు మాత్రమే స్పష్టంగా కనిపిస్తాయి. ఆయా గ్రహాలను చూసేందుకు వీలైనంత వరకు ఎక్కువగా చీకటిగా ఉండే ప్రాంతాలకు వెళ్లడం మంచిది. ఎందుకంటే లైట్ల వెలుతురులో అంత స్పష్టంగా కనిపించకపోవచ్చు. అందుబాటులో టెలిస్కోప్ ఉంటే గ్రహాలను మరింత స్పష్టంగా తిలకించేందుకు అవకాశం ఉంటుంది. మరి మీరు కూడా ఈ ఖగోళ వింతను చూడడం మరిచిపోవద్దు.

# రెడీ అవుతున్న ఇస్రో బాహుబలి

**బెంగళూరు :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తక్కువ కాలంలో అత్యంత క్లిష్టమైన కీలకమైన ప్రయోగాలను సక్సెస్ చేసి అగ్రదేశాల సరసన నిలబడగలిగింది. ఒకప్పుడు స్పేస్ లో అద్భుతాలు చేయడం అంటే రెండు మూడు దేశాలకు మాత్రమే పరిమితం. అమెరికా, రష్యా, చైనా లాంటి దేశాలకు మాత్రమే సాధ్యమైన అనేక ప్రయోగాలను ఇప్పుడు ఇస్రో చేసి చూపిస్తోంది. నాలుగు దశాబ్దాల క్రితం అంతరిక్ష ప్రయోగాలు చేపట్టేందుకు శ్రీకారం చుట్టిన భారత్‌ను చూసి చాలా దేశాలు అవహేళన చేశాయి. అలాంటి దేశాలకు ఏమాత్రం తీసిపోని విధంగా కీలకమైన ప్రయోగాలను సొంతంగా భారత్ సక్సెస్ చేసి ప్రపంచానికి చాటింది. మ్యాన్ మిషన్ కు సిద్ధమైన ఇస్రో అందుకోసం సొంతంగా భారీ లంచ్ ప్యాడ్ ను సిద్ధం చేస్తోంది. బాహుబలి లాంచ్ ప్యాడ్‌ను ఇస్రో కొత్తగా నిర్మిస్తుంది. ఈ లంచ్ ప్యాడ్ గురించి ఇటీవల పలు ఆసక్తికర వివరాలను వెల్లడించింది.కేంద్రం ఇందుకోసం ఇప్పటికే నిధులను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. రూ.3,985 కోట్లను మూడో లాంచ్ ప్యాడ్ కోసం ఆమోదం తెలిపింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోటలో ఇప్పటికే రెండు లాంచ్ ప్యాడ్లు అందుబాటులో ఉన్నాయి. మొదటి లాంచ్ ప్యాడ్ 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేయగా రెండో లాంచ్ ప్యాడ్ 20 ఏళ్ల క్రితం నిర్మించింది ఇస్రో. అయితే భారత్ భవిష్యత్తులో చేపట్టనున్న కీలక ప్రయోగాలకు ఇప్పుడు ఉన్న లాంచ్ ప్యాడ్‌లకు మించిన కెపాసిటీతో కూడిన లాంచ్ ప్యాడ్ అవసరం ఉంది. ప్రస్తుతం ఇస్రో ప్రయోగిస్తున్న రాకెట్ల ద్వారా రెండు నుంచి నాలుగు టన్నుల బరువున్న ఉపగ్రహాలను మాత్రమే నింగిలోకి పంపగలిగే సామర్థ్యం ఉంది. ఇస్రో త్వరలో చేపట్టనున్న మ్యాన్ మిషన్ గగన్యాన్ ప్రాజెక్టు కోసం భారీ రాకెట్ ద్వారా వ్యోమ నౌకలను అంతరిక్షంలోకి పంపాల్సి ఉంటుంది. అందుకోసం అత్యంత బరువైన మాడ్యూల్ ను అంతరిక్షంలోకి పంపాల్సి ఉంటుంది. అలాగే 235 కి భారత్ అంతరిక్షంలో సొంతంగా స్పేస్ స్టేషన్ ఏర్పాటు కూడా పూర్తి



చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2040లో చంద్రుడిపై భారత్ చెందిన వ్యోమగాములు అడుగు పెట్టాలని లక్ష్యంగా ఉంది. అలాంటప్పుడు రాకెట్ బరువు కాకుండా రాకెట్ ద్వారా తీసుకెళ్లే మాడ్యూల్ దాదాపు 70 నుంచి 75 టన్నుల బరువు ఉన్న పేలోడ్ని సైతం అంతరిక్షంలోకి పంపే సామర్థ్యం గల రాకెట్లను తయారు చేయాల్సి ఉంటుంది.ఇలాంటి న్యూ జనరేషన్ లాంచ్ వెహికల్ ఇస్రో రూపొందించాలన్నీ, ఇతర రాకెట్లను ప్రయోగించాలన్నా భారీగా లాంచ్ ప్యాడ్ సామర్థ్యం కూడా పెంచాల్సి ఉంటుంది. అలాగే అంతరిక్షంలోకి వెళ్లి తిరిగి భూమి మీదకు వచ్చే స్పేస్ షటిల్ ల్యాండ్ అయ్యేందుకు ఒక రన్ వే కూడా అవసరం. ఆ రన్ వే కూడా నిర్మించేందుకు ఇస్రో ప్లాన్ చేసుకుంటుంది. తాజాగా నిర్మించనున్న మూడో లాంచ్ ప్యాడ్ అందుబాటులోకి వస్తే తక్కువ సమయంలో ఎక్కువ ప్రయోగాలు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఒక్కో రాకెట్ తయారీ పూర్తయిన తర్వాత లాంచ్ ప్యాడ్ తీసుకువెళ్లి ప్రయోగం పూర్తి చేసేందుకు వారం నుంచి పది రోజులు సమయం పడుతుంది. ప్రస్తుతం రెండు లాంచ్ ప్యాడ్లు మాత్రమే ఉండగా మూడో లాంచ్ ప్యాడ్ అందుబాటులోకి వస్తే ప్రయోగాల సంఖ్య మరింత పెంచే అవకాశం ఉంటుంది. ఇస్రో ఇప్పటివరకు రూపొందించిన పీఎస్ఎల్వీ , జీఎస్ఎల్వి, మార్క్ 3 తరహా వాహక నౌకలు ఉండగా ఇటీవల ఎస్ఎస్ఎల్వి పేరుతో చిన్న తరహా రాకెట్లను రూపొందించి ప్రయోగం చేసింది. ఈ తరహా రాకెట్ల ప్రయోగం కోసం ప్రత్యేకంగా తమిళనాడులోని కులశేఖర పట్టణంలో లాంచ్ ప్యాడ్ ను ఏర్పాటు చేస్తోంది. అంటే ఇస్రో చేపట్టే రాకెట్ ప్రయోగాల కోసం మొత్తం నాలుగు లాంచ్ ప్యాడ్లు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం ఏడాదికి 10 నుంచి 15 వరకు మాత్రమే ఉన్న ఇస్రో చేపట్టే ప్రయోగాల భవిష్యత్తులో 100కు మించి ఉండేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి

# కేజ్రీవాల్‌పై దాడి, భగ్గుమన్న ఆప్

**న్యూఢిల్లీ:** ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కారుపై రాళ్ల దాడి జరిగింది. ఆయన ఈరోజు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆయన కారుపై రాళ్లను విసిరారు. రాళ్ల దాడిపై ఆమ్ ఆద్మీ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఊహించని ఘటన చోటుచేసుకుంది. 'ఆమ్ ఆద్మీ పార్టీ' జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై ఇటుకలు, రాళ్లతో దాడి జరిగింది. శనివారంనాడు న్యూఢిల్లీ నియోజకవర్గంలో ఆయన ఎన్నికల ప్రచారంలో ఉండగా ఈ ఘటన చోటుచేసుకున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. బీజేపీ 'గూండాలే' ఈ దాడికి పాల్పడినట్టు ఆప్ ఒక ట్వీట్‌లో ఆరోపించింది. ఇందుకు సంబంధించిన వీడియోను పోస్ట్ చేసింది. "ఓటమి భయంతో బీజేపీ అరవింద్ కేజ్రీవాల్‌పై దాడికి గూండాలను ఉసిగొల్పింది. ఎన్నికల ప్రచారంలో ఉండగా కేజ్రీవాల్‌ను గాయపరిచి ప్రచారం నుంచి దూరంగా



ఉండేలా చేసేందుకు బీజేపీ అభ్యర్థి పర్వేష్ గూండాలు ఇటుకలు, రాళ్లు ఆయనపై విసిరారు. బీజేపీ పిరికిపంద దాడులకు కేజ్రీవాల్ భయపడే ప్రసక్తేలేదు. ఢిల్లీ ప్రజలు మీకు (బీజేపీ) గట్టి గుణపాఠం చెబుతారు" అని ఆ పోస్ట్‌లో ఆప్ పేర్కొంది. బీజేపీకి ఓటమి భయం పట్టుకుందని ఆమ్ ఆద్మీ పార్టీ ఎక్స్ వేదికగా విమర్శించింది. ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ ఆ పార్టీ ఆందోళనకు గురవుతోందన్నారు. అందుకే కేజ్రీవాల్ ప్రచారాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించింది. కేజ్రీవాల్ ప్రచారం చేస్తుండగా బీజేపీకి చెందిన కొందరు కాన్వాయ్‌పై రాళ్లు రువ్వారని వెల్లడించింది. ఇలాంటి చర్యలకు ఆమ్ ఆద్మీ పార్టీ భయపడదని స్పష్టం చేసింది. ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు బుద్ధి చెబుతారని, ఇందుకు సంబంధించి రాళ్ల దాడి వీడియోను ఆమ్ ఆద్మీ పార్టీ పోస్ట్ చేసింది.

### పర్వేష్ వర్మ కౌంటర్

'ఆప్' చేసిన ఆరోపణలను పర్వేష్ వర్మ తిప్పికొట్టారు. అరవింద్ కేజ్రీవాల్ వాహనం ఇద్దరు యువకులను ఢీకొట్టిందని ఆయన తెలిపారు. కేజ్రీవాల్‌ను ప్రశ్నించేందుకు వచ్చినప్పుడు కారుతో ఆ యువకులను ఢీకొట్టారని, ఆ ఇద్దర్నీ లేడీ హార్డింగ్ ఆసుపత్రికి తరలించారని చెప్పారు. ఓటమి తప్పదని గ్రహించిన కేజ్రీవాల్ ప్రజల ప్రాణాలను కూడా లెక్కచేడయం లేదని ఆరోపించారు. గాయపడిన యువకులను పరామర్శించేందుకు ఆసుపత్రికి వెళ్తున్నట్టు పర్వేష్ వర్మ ఒక 'ట్వీట్' లో తెలిపారు.

## ఉల్లి ధరలకు రెక్కలు..



హొసూరు(బెంగళూరు): ఉల్లి ధరలు పరుగులు పెడుతున్నాయి. స్థానికంగా పండించే చిన్న రకం ఉల్లి ధర అమాంతం పెరిగింది. నిన్న, మొన్నటి దాకా రూ.70 ఉన్న కేజీ ధర కిలో రూ.100 పలికింది. కృష్ణగిరి జిల్లాతోపాటు పొరుగున సరిహద్దు ప్రాంతాల్లో ఉల్లి సాగు తగ్గడం కూడా కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు. హొసూరు పరిసర ప్రాంతాల్లో విస్తారంగా చిన్న ఉల్లిపాయ సాగు చేస్తుంటారు. అదేవిధంగా రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న అత్తిబెలె, ఆనేకల్ ప్రాంతాల్లో కూడా సాగు చేస్తుంటారు. ఇక్కడి పంటలు స్థానికంతోపాటు విదేశీ మార్కెట్‌లకు కూడా ఎగుమతి అవుతుంటాయి. ప్రస్తుతం ఈ ప్రాంతంలో దిగుబడి తగ్గడంతో సరిహద్దుల్లో పండించిన చిన్న ఉల్లిపాయలకు డిమాండ్ పెరిగింది

## 'నన్ను తప్పుగా ఇరికించారు, ఐపీఎస్ ప్రమేయం ఉంది'.. కోర్టుకు చెప్పిన సంజయ్ రాయ్



**కోల్‌కతా:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం కేసులో తనను తప్పుగా ఇరికించారని నిందితుడు సంజయ్ రాయ్ కోర్టుకు తెలిపాడు. ఈ నేరం తాను చేయలేదని చెప్పాడు. ఈ నేరానికి పాల్పడిన వారిలో ఒక పోలీస్ అధికారి కూడా ఉన్నట్లు కోర్టుకు వెల్లడించాడు. శనివారం సీల్దాలోని సీబీఐ కోర్టు ఈ కేసుపై తీర్పు ఇచ్చింది. పోలీస్ వాలంటీర్ అయిన నిందితుడు సంజయ్ రాయ్‌ను దోషిగా నిర్ధారించింది. కోర్టులో ప్రవేశపెట్టిన నిందితుడిని ఉద్దేశించి 'నీకు శిక్ష పడాలి' అని న్యాయమూర్తి అన్నారు. కాగా, తాను ఈ నేరానికి పాల్పడలేదని నిందితుడు సంజయ్ రాయ్ కోర్టుకు తెలిపాడు. నేరానికి పాల్పడిన వారిని విచారించలేదని ఆరోపించాడు. 'నన్ను తప్పుగా ఇరికించారు. నేను ఈ నేరం చేయలేదు. హత్యాచారం చేసిన వారిని వదిలివేస్తున్నారు. ఇందులో ఒక ఐపీఎస్ కూడా ఉన్నారు' అని కోర్టుకు చెప్పాడు. మరోవైపు సీసీటీవీ ఫుటేజ్, సీబీఐ సాక్ష్యాల ఆధారంగా ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌ను దోషిగా సీల్దా కోర్టు నిర్ధారించింది. సోమవారం శిక్షలు ఖరారు చేస్తామని ప్రకటించింది. అయితే ఆ రోజు కేసు విచారణ సందర్భంగా మాట్లాడేందుకు నిందితుడికి అనుమతిస్తామని న్యాయమూర్తి తెలిపారు. కాగా, సంజయ్ రాయ్‌పై నమోదైన కేసుల సెక్షన్లు, మోపిన అభియోగాలు, సీబీఐ వాదనల మేరకు దోషిగా తేలిన అతడికి సీబీఐ కోర్టు మరణ శిక్ష విధించే అవకాశమున్నట్లు తెలుస్తున్నది.

## ఆర్ఎస్ఎస్ చీఫ్ చేసిన వ్యాఖ్యలపై విరుచుకుపడ్డ రాహుల్‌గాంధీ



**పాట్నా :** దేశ స్వాతంత్ర్యం విషయంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ విరుచుకుపడ్డారు. ఆయన రాజ్యాంగ విరుద్ధంగా వ్యాఖ్యానించారని మండిపడ్డారు. బీహార్ రాజధాని పాట్నాలో జరిగిన" సంవిధాన్ సురక్ష సమ్మేళన్ " కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. " బీజేపీ, ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. అణగారిన వర్గాలను నిర్లక్ష్యం చేస్తున్నాయి. మైనారిటీ, దళితులు, రాజకీయాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ వారికి ఎలాంటి అధికారాలు ఉండడం లేదు. ఆర్ఎస్ఎస్ సహా మరికొన్ని సంస్థలే దేశాన్ని నడుపుతున్నాయి. దేశ సంపద కొందరు పారిశ్రామిక వేత్తల చేతుల్లోనే ఉంది. భారత రాజ్యాంగం ఒక పుస్తకం మాత్రమే కాదని, దళితులు ఎదుర్కొన్న అన్యాయాల గురించి అది మాట్లాడుతుంది. " అని రాహుల్ పేర్కొన్నారు.దేశ వ్యాప్తంగా కులగణన కచ్చితంగా అవసరమని, ఇది అభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తుందని, రాహుల్ అన్నారు. కాగా, ఇటీవల ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ స్వాతంత్ర్యం విషయంలో కీలక వ్యాఖ్యలు చేశారు. అయోధ్యలో రామమందిర ప్రతిష్ఠాపన రోజునే భారత్ నిజమైన స్వాతంత్ర్యాన్ని పొందిందన్నారు. శత్రువులతో భారత్ ఎన్నో శతాబ్దాల పాటు పోరాడిందని, అయితే రామమందిర ఉద్యమం ఎవరినీ వ్యతిరేకించడానికి ప్రారంభించింది కాదన్నారు. దేశం తనను తాను మేలుకొల్పుకోవడానికి చేసింది మాత్రమేనని అన్నారు. భారత్ తన కాళ్లపై నిలిచి ప్రపంచానికి మార్గం చూపుతుందని, రామమందిర ప్రతిష్ఠాపన సందర్భంగా దేశంలో ఎలాంటి అసమ్మతి చోటుచేసుకోలేదన్నారు. ఈ వ్యాఖ్యలపై రాహుల్ తీవ్రంగా స్పందించారు. మోహన్‌భగవత్ రాజ్యాంగ విరుద్ధంగా మాట్లాడారని విమర్శించారు.

## పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహించింది



పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహించిందని, ఇప్పుడు అదే ఆ దేశం పాలిట శాపమైందని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ అన్నారు. పాక్ పెంచి పోషించిన ఉగ్రవాదం ఇప్పుడు ఆ దేశాన్ని కబళిస్తోందన్నారు. ముంబైలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఉగ్రవాదం క్రమంగా పాక్ రాజకీయాల్లోకి ప్రవేశిస్తోందన్నారు. సీమాంతర ఉగ్రవాదాన్ని అణిచివేయాలని భారత్ సహా పలు దేశాలు కోరుతున్నట్లు చెప్పారు. అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. ఈ విషయంలో వెనుక ఉండరాదన్నారు. ఆయుధీకరణ విషయంలో భారత్ స్వావలంబన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్నేహాన్ని పెంచుకుంటూ, సమస్యలను తగ్గించుకుంటూ ప్రపంచ వేదికపై భారత్ ఓ నమ్మకమైన భాగస్వామిగా వ్యవహరిస్తోందన్నారు. పరస్పర గౌరవం, ప్రయోజనాలు, సుహృద్భావ సంబంధాలు అనే మూడు అంశాలే భారత దౌత్య విధానం అన్నారు.

# వెంకటేశ్ గారిని చూసి భయపడ్డాను : సంక్రాంతి 'బుల్లిరాజు'!

**'బుల్లిరాజు' పాత్రతో పాప్యులర్ అయిన రేవంత్ వెంకటేశ్ గారు చాలా సరదాగా ఉంటారని వ్యాఖ్య అనిల్ రావిపూడి గారు ఎంకరేజ్ చేశారని వెల్లడి మహేశ్ బాబు గారు మెచ్చుకున్నారంటూ హర్షం**



సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 14వ తేదీన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా విడుదలైంది. తొలి ఆటతోనే హిట్ టాక్ తెచ్చుకున్న ఈ సినిమా, రికార్డు స్థాయి వసూళ్లతో దూసుకుపోతోంది. ఈ సినిమా విడుదలైన తరువాత అందరి నోళ్లలో ఎక్కువగా నానిన పేరు 'బుల్లిరాజు'. ఈ సినిమాలో వెంకటేశ్ పదేళ్ల కొడుకు పాత్ర పేరు 'బుల్లిరాజు'. ఈ పాత్రను మాస్టర్ రేవంత్ పోషించాడు. ఫస్టాఫ్ అంతా కూడా ఈ పాత్రనే పడిపడి నవ్విస్తూ ఉంటుంది. తాజాగా సుమన్ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో రేవంత్ మాట్లాడుతూ... "మాది భీమవరం దగ్గర 'గణపవరం'... నాకు ఇప్పుడు పదేళ్లు... 5వ క్లాస్ చదువుతున్నాను. నాకు పవన్ కల్యాణ్ గారు అంటే చాలా ఇష్టం. ఒక పొలిటికల్ వీడియోలో అనిల్ రావిపూడిగారు నన్ను చూసి ఈ సినిమాలో ఛాన్స్ ఇచ్చారు. 'మా నాన్నకు వచ్చిందే రెండు స్టెప్పులు...' అనే డైలాగ్ ను ఆడిషన్ లో చెప్పించారు... ఓకే చేశారు. ఈ సినిమా రిలీజ్ తరువాత ఎక్కడికి వెళ్లినా 'బుల్లిరాజు' అని పిలుస్తుంటే చాలా హ్యాపీగా అనిపిస్తోంది" అని అన్నాడు. "తొలిరోజున షూటింగులో వెంకటేశ్ గారిని చూసి భయపడ్డాను... అలవాటు లేని వాతావరణం కావడం వలన కొత్తగా అనిపించింది. కానీ వెంకటేశ్ గారు, అనిల్ రావిపూడి గారు చాలా సరదాగా మాట్లాడుతూ, నాలోని భయం పోగొట్టారు. అప్పటి నుంచి సింగిల్ టేక్ లోనే చేశాను. వెంకటేశ్ గారు నన్ను భోజనానికి పిలిస్తే వెళ్లాను... చాలా బాగా చూసుకున్నారు. మహేశ్ బాబు గారు కబురు చేస్తే వెళ్లాను... నేను చాలా బాగా చేశానని మెచ్చుకున్నారు" అని చెప్పాడు.

# మాడ్ స్క్వేర్.. ఫైనల్ గా అఫీషియల్ డేట్ వచ్చేసింది




మాడ్ బ్లాక్‌బస్టర్ తర్వాత ప్రేక్షకులను మళ్లీ నవ్వుల పంట పండించడానికి సిద్ధమవుతున్న చిత్రం మాడ్ స్క్వేర్. సినిమా మొదటి భాగం విడుదలై ప్రేక్షకులలో మంచి క్రేజ్ అందుకున్న తర్వాత రెండో భాగం ఎలా ఉంటుందో అనే ఉత్కంఠ ఎక్కువగా ఉంది. ఈ సినిమా ఎలాంటి టీజర్ లేకుండానే మంచి క్రేజ్‌ను సంపాదించుకుంది. తాజాగా విడుదలైన పాటలు 'లడ్డూ గాని పెళ్లి' 'స్వాతి రెడ్డి' కూడా టాప్ ట్రెండింగ్ లిస్టులో మోత మోగిస్తుండడం విశేషం. సినిమాలో నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ కథనాయకులుగా కనిపించనున్నారు. ఇక ఫైనల్ గా మేకర్స్ ఈరోజు అధికారికంగా మాడ్ స్క్వేర్ విడుదల తేదీని ప్రకటించారు. ఈ చిత్రాన్ని మార్చి 29న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ కూడా ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచింది. "మరింత ఫన్ మీ కోసం, మరింత మాడ్‌నెస్ మీ ఊహలకు మించినది" అని మేకర్స్ తెలిపిన మాటలే సినిమాపై ఉన్న అంచనాలను చూపించాయి. కళ్యాణ్ శంకర్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. ఆయన తన వినూత్న కథన శైలితో కామెడీ ట్రాక్స్ తో ప్రేక్షకులను మళ్లీ మెప్పించడానికి సిద్ధమయ్యారు. భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని సమకూర్చగా, జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఈ సినిమాకు ఎడిటింగ్ అందిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. సూర్యదేవర నాగ వంశీ ఈ చిత్రానికి సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ఇక మాడ్ స్క్వేర్ 2023లో విడుదలైన మాడ్ సినిమా బాక్సాఫీస్ వద్ద ఒక రేంజ్ లో క్లిక్కయ్యింది. అందుకే జెట్ స్పీడ్ లో సీక్వెల్ కూడా రెడీ చేసేశారు. ఫస్ట్ పార్ట్ లో ముగ్గురు కాలేజీ స్నేహితుల సాహసాలు, వారి చుట్టూ ఉండే హాస్యాస్పదమైన పరిస్థితుల నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను నవ్వులతో ముంచెత్తింది. ఇప్పుడు మాడ్ స్క్వేర్ లో వారి పర్సనల్ లైఫ్ స్టైల్ ను చూపించనున్నారు. ముందు భాగాన్ని మించి మరింత వినోదాన్ని అందించడానికి సిద్ధంగా ఉందని మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమా భారీ అంచనాల మధ్య విడుదల అవుతుండగా, దీన్ని 2025 వేసవి సీజన్‌లో థియేటర్లలో పెద్ద పండుగగా మార్చాలని మేకర్స్ భావిస్తున్నారు. మరి మాడ్ స్క్వేర్ కామెడీ మళ్లీ అందరి మనసులు గెలుచుకుంటుందా? లేదా అనేది చూడాలి!

# నటనా ప్రావీణ్యుడు ఎన్టీఆర్ : బాలకృష్ణ



నటనలో ప్రయోగాలు చేసిన నటనా ప్రావీణ్యుడు ఎన్టీఆర్ అని సీనియర్ హీరో, హిందూపూర్ ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. తెలుగునాట నందమూరి తారక రామారావు విప్లవాన్ని తీసుకొచ్చారని వెల్లడించారు. కష్టజీవుల కన్నీళ్లు, అన్నార్తుల ఆకలి నుంచి టీడీపీ పుట్టిందని చెప్పారు. ఏపీ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు 29వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్‌లో సోదరుడు రామకృష్ణతో కలిసి బాలకృష్ణ నివాళు లర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. పేదలకు ఉపయోగపడే పథకాలను ఎన్టీఆర్ ప్రవేశపెట్టారన్నారు. ఎన్టీఆర్ అంటే నటనకు నిర్వచనమని, నవరసాలకు అలంకారమని చెప్పారు. ఎన్టీఆర్ అంటే ఒక వర్సిటీ అని, జాతికి మార్గదర్శకమన్నారు. అలాంటి మహనీయులకు మరణం ఎప్పటికీ ఉండదని తెలిపారు. తెలుగువారి ఆత్మగౌరవం కోసం టీడీపీని ఎన్టీఆర్ స్థాపించారని రామకృష్ణ చెప్పారు. తొమ్మిది నెలల్లోనే తెలుగు ప్రజలు ఆయనను ముఖ్యమంత్రిని చేశారని వెల్లడించారు. ప్రాంతాలు వేరైనా తెలుగు వారంతా ఒకటేనని ఎన్టీఆర్ చారని తెలిపారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా నివాళి అర్పించారు. 'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు' అన్న సూక్తిని మొదటిసారిగా రాజకీయాలకు పరిచయం చేసిన మానవతావాది.. నిరుపేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపిన మహనీయుడు ఎన్టీఆర్. బడుగు బలహీన వర్గాల వారికి రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించిన సమతావాది.. స్త్రీలకు సాధికారతనిచ్చిన సంస్కర్త.. స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఆ మహానాయకుని స్మృతికి నివాళులర్పిద్దాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో.. "అధికారం అంటే పేదల జీవితాలు మార్చేందుకు వచ్చిన అవకాశం" అని నిరూపించిన మాననీయులు ఎన్టీఆర్ ఆశించిన సమసమాజాన్ని సాధించుకుందాం. ఎన్టీఆర్ ఆశయ సాధనలో అనుక్షణం పనిచేస్తామని.. తెలుగు జాతిని నెంబర్ వన్ చేసేందుకు కంకణబద్ధులై ఉన్నామని తెలుపుతూ.. ఆ యుగపురుషుని వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నాను అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

# థమన్ వ్యాఖ్యలపై స్పందించిన చిరంజీవి

బాలకృష్ణ డాకు మహరాజ్ సక్సెస్ ఈవెంట్‌లో సంగీత దర్శకుడు ఎస్ ఎస్ థమన్ తెలుగు సినిమా గురించి మాట్లాడుతూ.. ఎమోషనల్ అయ్యాడు. విజయం అనేది ఎంత డబ్బు పెట్టిన దొరకదు. అది వచ్చినప్పుడు ఇచ్చే ఎనర్జీ వేరు. మనం లైఫ్‌లో చాలా ముందుకు పోవడానికి సక్సెస్ చాలా ఉపయోగపడుతుంది. సక్సెస్ లేకపోతే నేను ఫిలిం నగర్‌కి కూడా వెళ్లేవాడిని కాదు. అయితే ఒక సక్సెస్ వచ్చిందని చెప్పడానికి కూడా ఇప్పుడు నిర్మాతలకు చెప్పబుద్ధి కావడం లేదు. అలా చేబితే అతడిపై నెగిటివ్‌గా ట్రోల్ చేయడం.. నెగిటివ్‌గా ట్రెండ్ చేయడం జరుగుతుంది. మీరు చేసే నెగిటివ్ ట్రోల్స్ చేయడం వలన నిర్మాతల జీవితాలు ఎఫెక్ట్ పడుతున్నాయి. నేను ఎందుకు చెబుతున్నాను అంటే ఈరోజు ప్రపంచం మొత్తం తెలుగు సినిమాను చాలా గర్వంగా చూస్తుంది. తెలుగు సినిమా ఇప్పుడు ఒక వెలుగు వెలుగుతుంది. ఇప్పుడు ఏ సినిమా ఇండస్ట్రీకి వెళ్లిన తెలుగులో ఒక సినిమా చేయాలి అని అడుగుతున్నారు. మనమే మన సినిమాని చంపేసుకుంటుంటే ఏం బ్రతుకు బ్రతుకుతున్నాం అనేది అర్థం కావాట్లేదు. విపరీతమైన ట్రోల్స్ వలన బాధగా ఉంది. ఒక సక్సెస్‌ని నిజంగా చెప్పుకోలేకపోతున్నాం. ఇది ఎంత దురదృష్టకరం. మీరు పర్సనల్‌గా కొట్టుకొండి కానీ సినిమాను చంపేయకండి. నేను అదే వేడుకుంటున్నాను అంటూ థమన్ చెప్పుకోచ్చాడు. అయితే ఈ వ్యాఖ్యలపై మెగాస్టార్ చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. డియర్ థమన్ నిన్న నువ్వు మాట్లాడిన మాటలు హృదయాల్ని తాకేలా ఉన్నాయి. ఎప్పుడూ సరదాగా మాట్లాడుతూ వుండే నీలో ఇంత ఆవేదన వుండడం నాకు ఒకింత ఆశ్చర్యంగా కూడా అనిపించింది. కానీ మనసు ఎంత కలత చెందితే నువ్వింతగా స్పందించావో అని అనిపించింది. విషయం సినిమా అయినా క్రికెట్ అయినా మరో సామజిక సమస్య అయినా సోషల్ మీడియా వాడుతున్న ప్రతి ఒక్కరు తమ మాటల తాలూకు ప్రభావం ఆ వ్యక్తుల మీద ఎలా వుంటుందని ఆలోచించాలి. మనం పాజిటివ్ గా వుంటే ఆ ఎనర్జీ మన జీవితాలని కూడా అంతే పాజిటివ్ గా ముందుకు నడిపిస్తుంది. గాడ్ బ్లెస్ యూ థమన్ అంటూ చిరు రాసుకోచ్చాడు.



# బ్లాక్‌లో మెరిసిన ఎన్టీఆర్–నీల్ హీరోయిన్



'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' సినిమాలో నిఖిల్‌కు జోడీగా నటించిన ముద్దుగుమ్మ రుక్మిణి వసంత్. ఈ మధ్య కాలంలో టాలీవుడ్ లో ఈ అమ్మడికి పెద్ద సినిమాలు ఏమీ పడలేదు. కానీ కన్నడంలో మాత్రం ఈ అమ్మడు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా వరుస సినిమాలు చేస్తూ వస్తోంది. ముఖ్యంగా ఈ అమ్మడు చేసిన సప్త సాగరాలు దాటి సినిమా రెండు పార్ట్‌లకు మంచి స్పందన దక్కింది. ఆ సినిమా రెండు భాగాలను తెలుగు ప్రేక్షకులు చూసి ఆదరించారు. అందుకే తెలుగులో ఈ అమ్మడు డైరెక్ట్ సినిమా మళ్లీ ఎప్పుడు చేస్తుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు తెలుగులో ఈ అమ్మడు ఎన్టీఆర్‌కి జోడీగా నటించబోతుంది. సప్త సాగరాలు దాటి సినిమాలో నటనతో మెప్పించిన ఈ అమ్మడు అందంతోనూ ఆకట్టుకుంటూ ఉంది. సింపుల్ అండ్ స్వీట్ లుక్‌లోనే కాకుండా స్కిన్ షోతోనూ ఈ అమ్మడు ఆకట్టుకుంది. పలు సార్లు సోషల్ మీడియా ద్వారా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేసిన ఈ అమ్మడు ఈసారి సింపుల్ అండ్ స్వీట్ అనిపించే విధంగా బ్లాక్ ఔట్ ఫిట్‌లో సందడి చేసింది. ఆకట్టుకునే అందంతో పాటు బ్లాక్ ఔట్ ఫిట్‌లో ఈమె అందానికి ఫిదా అవుతున్నారు. బ్లాక్ డ్రెస్ ఈమెకి బాగా సెట్ అయ్యింది. గతంలో షేర్ చేసిన ఫోటోలతో పోల్చితే ఈ ఫోటోలు మరింత ఆకర్షణీయంగా ఉన్నాయంటున్నారు. ఎన్టీఆర్‌తో ఈమె నటించబోతుంది అంటూ నందమూరి ఫ్యాన్స్ ఈ పోటోలను తెగ షేర్ చేస్తున్నారు. దర్శకుడు ప్రశాంత్ నీల్ ఇటీవలే ఎన్టీఆర్‌తో సినిమాకు సంబంధించిన షూటింగ్ ప్రారంభించాడని, ఈ నెల చివరి వారంలో ఎన్టీఆర్ సైతం షూటింగ్‌లో జాయిన్ కాబోతున్నాడు అంటూ వార్తలు వస్తున్నాయి. ఆ విషయమై మరింత క్లారిటీ రావాల్సి ఉంది. అంతే కాకుండా ఎన్టీఆర్ కి జోడీగా రుక్మిణి వసంత్ నటిస్తున్నట్లుగా వస్తున్న వార్తల విషయంలో ఇప్పటి వరకు అటు నుంచి కానీ, ఇటు నుంచి కానీ ఎలాంటి స్పందన రాలేదు. త్వరలోనే ఆ విషయమై అధికారికంగా ప్రకటన వస్తుందేమో చూడాలి.

# శివుని ఆజ్ఞతోనే 'కన్నప్ప' చిత్రం రూపుదిద్దుకుంటోంది: మంచు విష్ణు



డైనమిక్ హీరో విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా 'కన్నప్ప' చిత్రం భారీ ఎత్తున రూపొందుతోంది. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మంచు మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. 2025 ఏప్రిల్ 25న ఈ సినిమా గ్రాండ్ గా విడుదల కానుంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్లు, టీజర్ అందరినీ ఆకట్టుకున్నాయి.

ఇక ఈ మూవీ ప్రమోషన్స్ కు బెంగళూరులో తెర లేచింది. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హీరో మంచు విష్ణు, దర్శకుడు ముఖేశ్ కుమార్ సింగ్, సీనియర్ నటుడు శరత్ కుమార్, స్టార్ కొరియోగ్రాఫర్ ప్రభుదేవా, కన్నడ నిర్మాత రాక్ లైన్ వెంకటేశ్ పాల్గొన్నారు.డైనమిక్ హీరో విష్ణు మంచు మాట్లాడుతూ... "కన్నప్ప ప్రమోషన్స్‌ను కన్నడ నేల నుంచి ప్రారంభించడం ఆనందంగా ఉంది. కన్నడ కంఠీరవ రాజ్ కుమార్ గారు మొదటి సారిగా కన్నప్ప చిత్రాన్ని చేశారు. ఆ తరువాత శివ రాజ్ కుమార్ గారు కూడా చేశారు. తెలుగులో స్వర్గీయ శ్రీ కృష్ణంరాజు గారు బాపు రమణ దర్శకత్వంలో కన్నప్ప చేశారు. మళ్లీ ఇప్పుడు మేం కన్నప్ప కథను చెప్పబోతోన్నాం. కన్నప్ప ఎవరు? ఆయన కథ ఏంటి? ఆయన చేసిన గొప్ప కార్యాలు ఏంటి? అని ఈ తరానికి క్లియర్‌గా చూపించాలనే ఈ కన్నప్ప సినిమాను చేస్తున్నాం. ముఖేష్ కుమార్ సింగ్ బుల్లితెరపై ఓ లెజెండ్. మహాభారతం సీరియల్‌ను అద్భుతంగా తెరకెక్కించారు. ఇండియా నుంచి టీంను న్యూజిలాండ్‌కు తీసుకెళ్లాం. ఇతర దేశాల నుంచి కూడా టెక్నీషియన్లను తీసుకొచ్చాం. శరత్ కుమార్ గారు సెట్‌కి ఆన్ టైంకి వచ్చేవారు. ప్రభు దేవా అన్న అడిగిన వెంటనే మా ప్రాజెక్ట్ కోసం వచ్చారు. అసలు ఈ కథను అనుకున్నప్పుడు రాక్ లైన్ వెంకటేష్ గారికే ఫోన్ చేసి చెప్పాను. అద్భుతంగా ఉంటుంది చేయ్ అని ధైర్యాన్ని ఇచ్చారు. శివుని ఆజ్ఞతోనే ఈ చిత్రం ప్రారంభమైందని అనిపిస్తుంది. నాకు ఈ కన్నప్ప ఎంతో ప్రత్యేకం. ఆర్ఆర్ అవ్వక ముందే రాక్ లైన్ వెంకటేష్ గారు ఈ మూవీని చూశారు. అద్భుతంగా వచ్చిందని భరోసానిచ్చారు. ఇక ఆ శివుని ఆశీస్సులతో మేం ఏప్రిల్ 25న రాబోతున్నాం" అని వివరించారు.